ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 282 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | గురువారం 8 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### భారీగా తగ్గిన వెండి

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతున్నాయనే సంకేతాల నేపథ్యంలో వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. సోమవారం ఎంసిఎక్స్ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.21 వేలు తగ్గింది. మధ్యాహ్నం తర్వాత ఒక్క గంటలోనే కిలో వెండి ధర భారీగా తగ్గి రూ.2,33,120 కు చేరింది. ముఖ్యంగా ఉక్రెయిన్-, రష్యా యుద్ధానికి సంబంధించి సానుకూల పరిణామాలు కనిపించడంతో పెట్టుబడిదారుల్లో లాభాల స్వీకరణ కనిపించింది.

### ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు

కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శని వారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబంధిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్దిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్థవంతమైన రీ ఛార్జింగ్‌కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రేసిబిలిటీ) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. మరో ఇద్దరికి సిట్ నోటీసులు



- సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి నోటీసులు
- ఉదయం సిట్ ఎదుట హాజరుకావాలని నోటీసులు
- ప్రతిపక్ష నేతగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు కొండల్‌రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తింపు
- సిట్ కాస్తా కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లాగా అయిపోయింది

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపులు తిరుగుతోంది. దర్యాప్తు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ముఖ్య నేతలు తెరపైకి వస్తున్నారు. ఇప్పటి వరకు పోలీస్ అధికారులు, ప్రైవేటు వ్యక్తుల చుట్టే తిరిగిన దర్యాప్తు, తాజాగా ప్రజాప్రతినిధుల వైపు మళ్లింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంల ఏర్పాటైన సిట్ కేసును వేగంగా దర్యాప్తు చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చింది. గురువారం ఉదయం హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ప్రతిపక్ష నేతగా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో - మిగతా3లో



## రష్యా నుంచి భారత్‌కు.. రూ.15 లక్షల కోట్ల చమురు దిగుమతి

- దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది
- ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడి
- యుద్ధం మొదలైన ఏదాది నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా

## ఆర్థిక భరోసాకు పెద్దపీట




- నేతన్నల జీవితాల్లో సంక్రాంతి వెలుగులు
- తెలంగాణ సర్కార్ అదిరిపోయే గుడ్ న్యూస్..
- వారికి రూ.లక్ష రుణ మాఫీ..
- అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థికంగా సతమతమవుతున్న చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఊహించని శుభవార్త
- ఏకంగా లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటన
- వేల మంది నేతన్నలకు అండగా ప్రభుత్వం

హైదరాబాద్

తెలంగాణలోని చేనేత కార్మికుల జీవితాల్లో సంక్రాంతి వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేతన్నలు తీసుకున్న రూ.లక్ష వరకు వ్యక్తిగత రుణాలను మాఫీ చేస్తున్నట్లు హ్యాండ్లూమ్, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా ప్రకటించారు. అప్పుల భారం నుంచి కార్మికులను విముక్తం చేసి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ఈ రుణమాఫీ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,784 మంది చేనేత కార్మికులు నేరుగా లబ్ధి పొందనున్నారు. 2017 నుండి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న రుణాల కోసం ప్రభుత్వం రూ. 27.14 కోట్లను మంజూరు చేసింది. దీనివల్ల గత కొన్నేళ్లుగా అప్పుల ఊబిలో ఉన్న నేతన్నలకు పెద్ద ఊరట లభించినట్లయింది. కేవలం రుణమాఫీకే పరిమితం కాకుండా చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. నేతన్నల భవిష్యత్తు అవసరాల కోసం అమలు చేస్తున్న చేనేత భరోసా, పొదుపు పథకాలకు ప్రభుత్వం ఏకంగా రూ. 303 కోట్లను కేటాయించింది. తీసుకున్న రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు పావలా వడ్డీ పథకాన్ని - మిగతా3లో

## నాడు ఇందిరమ్మ ధైర్యం నేడు మోదీ భయం



- 'తేడా గమనించండి సార్' అంటూ రాహుల్ ఫైర్!
- ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం
- 'సార్, ప్లీజ్ మిమ్మల్ని కలవొచ్చా' అని మోదీ అడిగారట
- పాత వీడియోతో ప్రధానిపై రాహుల్ విమర్శలు
- పన్నుల మోత, అపాచీ లేట్
- ట్రంప్ కేవలం మాటలతోనే కాదు, చేతల్లోనూ భారత్‌పై కఠినంగా ఉన్నారు




## కుక్కలు కరిచే మూడ్‌లో ఉన్నాయని ముందే ఎవరూ ఊహించలేరు

- వీధి కుక్కల వివాదంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- అటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లలో కుక్కకాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీ
- ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దు

## సంక్రాంతికి టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

- ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్
- సంక్రాంతికి 1,387 స్పెషల్ బస్సులు మీ కోసం
- ప్రయాణికులకు తీపికబురు చెప్పిన టీజీఎస్ఆర్టీసీ
- ప్రయాణికుల రద్దీ ఆధారంగా అవసరమైతే సర్వీసులు పెంచటానికి సన్నాహాలు

3లో



సంక్రాంతి పండగ కోసం సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ తీపికబురు అందించింది. ఈ పండగ సమయాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలను చేరవేసేందుకు ఆర్టీసీ యజమాన్యం ప్రత్యేక బస్సులను షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. అలాగే సంస్థకు ఆదాయాన్ని పెంచడంతో పాటు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి ప్రయాణీకుల సంఖ్య మరింత పెరిగింది.



## క్వార్టర్స్‌లో నెగ్గాం.. సెమీస్, ఫైనల్లోనూ మనదే గెలుపు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు చెబుతున్నారు
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాల్లేవ్
- ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి




## నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్

- ఉగ్రవాదంపై పోరు, ప్రాంతీయ పరిస్థితులపై చర్చలు
- ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు మోదీ ఫోన్ కాల్
- భారత్, ఇజ్రాయెల్ సంబంధాల గురించి చర్చలు
- నెతన్యాహు, ఇజ్రాయెల్ వాసులకు న్యూ ఇయర్ విషెస్ చెప్పిన భారత ప్రధాని

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు

- విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు
- తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయి
- కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదు



## సంపాదకీయం

# భారతీయ గ్రంథాలు.. కీర్తి సంకేతాలు


అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి అక్షరం ఒక శక్తివంత మైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంధానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్ధశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెప లాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జ పత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవు తాయి. మనిషి అజ్ఞానంతోనో, తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన ఆరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసు కెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రౌతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్తానత్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంధాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృ తిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంధాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడు కునేది. ముద్రణా యంత్రాల ఆధునీ కరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అంద మైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడు తున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవు తున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంధాలు, సృజనా త్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ఇలాంటి స్థితిలో పుస్తక ప్రదర్శన నిర్వహించడం చాలా ఉపయుక్తం. 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయ వాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. 1980ల్లో రాజమండ్రిలో ఒక దశాబ్దం పాటు పుస్తక మహోత్సవాన్ని అక్కడి నిర్వాహకులు నిర్వహించారు. ఆ పుస్తక ప్రదర్శనలో భాగంగా విజయ వాడలోని ప్రముఖ ప్రచురణ కర్తలు పుస్తక దుకాణాల యజమానులు పాల్గొనేవారు. రాజమండ్రి పుస్తక ప్రదర్శన నిలిపి వేయడంతో నేషనల్ బుక్ ట్రస్ట్ సహాయంతో 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయవాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆ స్ఫూర్తితో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా విజయ వాడ పుస్తక మహోత్సవం గత 34 ఏళ్లుగా విజయ వాడ నగరంలో కొనసాగించడం అభినందనీయం. ఈ ఏడు జనవరి 2 నుంచి 12 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విజయవాడ బుక్ ఎక్జిబిషన్ కొనసాగుతుంది. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వల్లమూడి విమలాదేవి, ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను ఈ ఏడాది పెట్టారు. ఈ ఏడాది 294 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈసారి ఎక్కువగా ఇంగ్లీషు బుక్ పబ్లిషర్లు రానున్నారు. పుస్తక ప్రదర్శనలో ఉండే స్టాళ్లలో ప్రతి పుస్తకంపై తప్పనిసరిగా 10శాతం రాయితీ ఇస్తారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. విజయవాడ 36వ పుస్తక మహోత్సవానికి భారీగా తరలివస్తున్న పుస్తక ప్రియులు, స్టాళ్లను పరిశీలించి, అభిరుచులకు తగ్గట్లు కొత్త పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.ఈ నెల 12వ తేదీ వరకూ బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న ఈ పుస్తక మహోత్సవంలో మొత్తం 314 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది. శని, ఆదివారాల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. నవలలు, జీవిత చరిత్రలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, విప్లవ సాహిత్య పుస్తకాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానికులే కాకుండా పక్క జిల్లాల ప్రజలూ తరలివస్తున్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అకడమిక్ పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు.బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే అవుతుంది. అందుకే చాలా మందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా. దేవున్ని జారతలో కొలిచినట్లే, గ్రంధాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనే వారు, చదివే వారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూతులను మిగులుస్తుంది అనేది నూటికి నూరు పాళ్ళు నిజం. ००

# అసమాన మేధావి స్టీఫెన్ హాకింగ్



ఆయన ఒక విధి వంచితుడు. అయితే ఆయన పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు విధి ఓడి పోయింది. విధి వక్రించినా ఆయన వెరవలేదు. శరీరం కదల్చడానికి వీలు లేని స్థితిలోనూ ఆయన చేసిన పరిశోధనా కృషి ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు ప్రఖ్యాతిని తెచ్చిపెట్టింది. అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందుకున్న ఘనుడు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులోనూ స్థానం పొందిన మేధావి. కనీసం కదలడానికి సహకరించని శరీరం, చక్రాల కుర్చీకి అతుక్కు పోయిన మనిషి, కనీసం మాట్లాడటానికీ కంప్యూటర్ సహాయం... ఇవి ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ను గుర్తించడానికి ఆనవాళ్లు. మోటార్ న్యూరాన్ వ్యాధి శరీరాన్ని కబళిస్తున్నా... చేస్తున్న పనికి శరేరం సహకరించక పోయినా...ఆయన పరిశోధనలు ఖగోళ శాస్త్రంలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాన్ని చూపాయి. శాస్త్రవేత్తగానే కాక ఆయనపై ఆయనకున్న నమ్మకం, కలసిరాని విధిని తనకు అనుకూలంగా మార్చుకునే తత్వం నేటి యువతకు ఆదర్శం. స్టీఫెన్ హాకింగ్ ఓ సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త. ఎమియోట్రోఫిక్ లేటరల్ స్కెర్లోసిస్ అనే నాడీమండలానికి సంబంధించిన జబ్బు వల్ల క్రమక్రమంగా దశాబ్దాల తరబడి అతని శరీరభాగాలు చచ్చుబడుతూ వచ్చినా, తన మెదడు పనిచేస్తూండడాన్ని దన్నుగా ఉపయోగించుకుని కృష్ణబిలాలకు సంబంధించిన అనేక అంశాలు మొదలుకొని సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేశాడు. హాకింగ్ రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్సులో గౌరవ సభ్యుడిగా, పాంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జీవిత కాల సభ్యునిగా ఉన్నాడు. ఆయన అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందుకున్నాడు. టైమ్స్ పత్రిక వారి 100 మంది అత్యంత గొప్పవారైన బ్రిటీషర్ల జాబితాలో 25వ స్థానం అతనిదే. ఆయన రాసిన ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అన్న పుస్తకం ద బ్రిటీష్ సండే టైమ్స్ బెస్ట్ సెల్లర్ల జాబితాలో 237 వారాల పాటు నిలిచి రికార్డులు బద్దలు కొట్టింది, ఈ పుస్తకపు అమ్మకాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులోనూ స్థానం సంపాదించాయి. శరీరం చాలావరకూ చచ్చుబడి పోయినా ఆయన జీవితాంతం ఒకే ఒక్క దవడ ఎముక కదులుస్తూ, దానికి అమర్చిన సంభాషణలు–ఉత్పత్తి చేసే పరికరం ఉపయోగించి సంభాషించేవాడు. ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త గెలిలియో మరణించి దాదాపు 300 సంవత్సరాల అనంతరం 1942 జనవరి 8వ తేదీన ఇంగ్లాండు లోని ఆక్స్ ఫర్డ్ లో స్టీఫెన్ హాకింగ్ జన్మించాడు. గణిత ఉపాధ్యాయుని ప్రేరణతో గణిత శాస్త్రంలో స్పెషలైజేషన్ చేద్దామను కున్నాడు స్టీఫెన్. కాని దానికి వ్యతిరేకంగా తండ్రి రసాయన శాస్త్రంలో చేర్పించాడు. తరువాత 1959లో నేచురల్ సైన్స్ విద్య కోసం స్కాలర్ షిప్ పరీక్ష రాశాడు. అందులో సఫలీకృతుడు కాగలిగినా... భౌతిక శాస్త్రంలో స్పెషలైజేషన్ చేశాడు స్టీఫెన్. 1962లో కేవలం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కాగలిగాడు. కాస్మాలజి, జనరల్ రిలెటివిటీ పరిశోధనల కోసం ఆక్స్‌ఫర్డ్ కి వెళ్ళాడు. అప్పటి నుంచి స్టీఫెన్ పరిస్థితి పూర్తిగా మారింది. తినాలన్నా... కనీసం బూట్ల లేసు కట్టుకుందా మన్నా... స్టీఫెన్ శరీరం సహకరించేది కాదు. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్ళిన స్టీఫెన్ పరిస్థితి ఆయన తల్లిదండ్రులను కలవర పెట్టింది. భోజనం చేయడానికి ఆయన పడుతున్న ఇబ్బంది... తల్లిని మథనపెట్టింది. ఆ సమయంలోనే ఆసుపత్రిలో చేసిన పరీక్షల్లో ఆయనకు మోటార్ న్యూరాన్ వ్యాధి అనే భయంకర వ్యాధి ఉన్నట్టు తెలిసింది. నాడీ మండలం పై అంటే నరాలు, వెన్నుపూస పై ఇది ప్రభావం చూపుతుంది. భౌతిక శాస్త్రవేత్త వెర్నర్ ఇస్రయిల్ 'మోజట్ కంపోజింగ్ సింఫనీ' తెచ్చి స్టీఫెన్ తలకు అమర్చాడు. దాని వల్ల ఆయనకు తనను తాను వ్యక్తీకరించుకునే అవకాశం కలిగింది. దాన్ని అభ్యసించడానికి ఆయనకు కొంత సమయం పట్టినా, తర్వాత కాలంలో అది ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది. 1970 నాటికి మాట పూర్తిగా పడిపోయింది. అతని హావభావాలు కుటుంబ సభ్యులకు, అతి సన్నిహితులకు మాత్రమే అర్థమయ్యేవి. 1985లో ఆయనకు నిమోనియా వచ్చింది , అప్పటి నుంచీ ఒక చక్రాల కుర్చీకి పరిమితమై తన చేతి చిటికెన వేలి కదలికల సాయంతో మాత్రమే దానికి అనుసంధానించి, రూపొందించిన 'వాయిస్ సింథసైజర్'తో తన ఆలోచనలను శాస్త్ర లోకానికి అందిస్తున్నారు. హాకింగ్ చిటికెన వేలు కదలికల్ని ఒక హ్యాండ్ కంట్రోలర్ యంత్రానికి అమర్చిన తెరపై అక్షరాలను స్కాన్ చేసే కర్సర్ నియంత్రి స్తుంది. ఆయన ఎంచుకున్న అక్షరాల్ని, యంత్రంలోని వ్యవస్థ తనంతట తానే పని చేసే 'అల్గారిదమ్' సాయంతో మాటలు వాక్యాల రూపంలో రూపొందించి తెరపై ప్రకటిస్తుంది. కంప్యూటర్ ఇంజనీర్ డేవిడ్, ఒక చిన్న కంప్యూటర్‌ని స్టీఫెన్ హాకింగ్ వీల్‌ఛైర్‌కు అమర్చాడు. అందులోని సింథసైజర్ విషయాన్ని మాటగా మార్చి ఎదుటి వారికి వినిపిస్తుంది. అందుకోసం తన గొంతునే వాడమన్నాడు స్టీఫెన్. మాట పడిపోక ముందున్న తన గొంతు ధ్వనిని అందులో ఉపయోగించ మన్నాడు. దాని వల్ల స్టీఫెన్ హాకింగ్ సాంకేతిక సంభాషణ సహజ సంభాషణలా మారిపోయేది. డాక్టరేట్ సంపాదించేలోపే స్టీఫెన్ మరణిస్తాడని అనుకున్నారంతా... కానీ ఆయన పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు మృత్యువు ఓడిపోయింది. మళ్లీ విశ్వవిద్యాలయానికి తిరిగివచ్చిన హాకింగ్ తన పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలిసి మిత్రులు సహకరించాలని చూసినా స్టీఫెన్ సున్నితంగా తిరస్కరించేవాడు. ఎన్నో విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన స్టీఫెన్ కు, వ్యాధి అడ్డంకిగా మారలేదు. తన నాడీ మండలం పూర్తిగా పాడవుతున్నా, మెదడు సహకరించడాన్ని స్టీఫెన్ గమనించాడు. 1966లో ఆయన సమర్పించిన 'ప్రాపర్టీస్ ఆఫ్ ఎక్స్‌పాండింగ్ యూనివర్సెస్' థీసిస్‌ను ఆన్‌లైన్‌లో ఉంచగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది దానిని చదివేందుకు ఆసక్తి చూపారు. 1970 నుంచి కృష్ణబిలాలపై పరిశోధనలు ప్రారంభించాడు. తీరికలేని స్టీఫెన్ తనకు వ్యాధి వుందన్న విషయాన్ని కూడా మరచి పోయాడు. క్వాంటం థియరి, జనరల్ రిలెటివిటీ లను ఉపయోగించి... కృష్ణబిలాలు కూడా రేడియేషన్ ను వెలువరిస్తాయని కనుగొన్నాడు. 1971నుంచి బిగ్ బ్యాంగ్ పై పరిశోధనలు మొదలు పెట్టిన ఆయన కృష్ణబిలాలకు సంబంధించి ఎన్నో విషయాలను ఆవిష్కరించాడు. 1984లో ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ పుస్తకరచన ప్రారంభించాడు. ఆ సమయంలోనే వ్యాధి వల్ల 1985లో వైద్యుల దగ్గర ఉండాల్సి వచ్చింది. అప్పుడే కంప్యూటరు సాయంతో మాట్లాడ గలిగే పరికరాన్ని స్టీఫెన్ తయారు చేసుకున్నాడు. దాని సాయంతోనే 1988లో పుస్తకాన్ని వెలువ రించాడు. అది అమ్మకాల్లో సృష్టించిన రికార్డు అంతా ఇంతా కాదు. ప్రపంచ వ్యాప్తంగా 40 భాషల్లో ఆ పుస్తకం వెలువడింది. తెలుగులోనూ... కాలం కథ పేరుతో వెలువడింది. ప్రపంచ వ్యాప్తంగా ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అమ్మకాల్లో సృష్టించిన రికార్డు వల్ల అది 1998 అంటే వెలువడిన 10 సంవత్సరాల తరువాత గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించింది. 2014లో హాకింగ్ జీవిత విశేషాలతో ది థియరీ ఆఫ్ ఎవ్వరిథింగ్ అనే సినిమా తీశారు. దీనికి ఆస్కార్ అవార్డు కూడా వచ్చింది. సోషల్ మీడియాలో చేరిన క్షణాల్లోనే ఆయన మిలియన్ ఫాలోవర్స్‌ను పొందాడు. ఇక స్టీఫెన్ హాకింగ్ చేసిన తొలి పోస్టుకు క్షణాల్లో ఏకంగా ఐదులక్షల లైక్లు వచ్చాయి. 1975 ఎడిటంగ్ మెడల్; 1976 రాయల్ సొసైటి హ్యూగ్స్ మెడల్; 1979 అల్బర్ట్ ఐన్ స్టీన్ మెడల్; 1982 ఆర్డర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్ (కమాండర్); 1985 రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ బంగారు పతకం; 1986 పొంటిఫిషియల్ అకాడమి ఆఫ్ సైన్స్ లో సభ్యత్వం; 1988 భౌతిక శాస్త్రంలో అంతర్జాతీయ బహుమతి; 1989 కన్ కర్డ్ లో ఆస్ట్రియా ప్రిన్స్ అవార్డ్; 1989 కంపానియన్ ఆఫ్ ఆనర్; 1999 అమెరికా భౌతిక శాస్త్ర సమితి వారి జూలియస్ ఎడ్గర్ లిలెన్ ఫెల్డ్ ప్రైజ్; 2003 కేస్ వెస్టెన్ రిజర్వ్ విశ్వ విద్యాలయం వారి మైకెల్ సన్ మోర్లీ అవార్డ్; 2006 రాయల్ సొసైటీ కాప్లి మెడల్ తదితర ఎన్నో అవార్డులను ఆయన సొంతం చేసుకున్నాడు. 2018 మార్చి 14 న బుధవారం ఆయన కేంబ్రిడ్జ్‌లోని తన నివాసంలో మరణించాడు.

# నూతన ఆవిష్కరణల రూపకర్త గెలీలియో



గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలీస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలీలి (జన 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు.గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళీ ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతంను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు. అప్పటికే మత గ్రంథాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ "ఆతిజీశ్రీనీణబీవబఇనీనిఇవతీనితినిణ బిష్ట్రవ బిలినీ ఇష్ట్రతివట లినీతీశ్రీట బంబబివవఎబ" అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథానికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది.

ధర్మఘంట

# నాడు ఇందిరమ్మ ధైర్యం- నేడు మోదీ భయం

ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవడానికి “సార్, ప్లీజ్ నేను మిమ్మల్ని చూడొచ్చా?“ అని బతిమాలినట్లుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. “తేడా గమనించండి సార్ జీ!“ అంటూ మోదీని ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాడు అమెరికా బెదిరింపులకు ఏమాత్రం భయపడని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎక్కడ? నేడు అమెరికా అధ్యక్షుడి ముందు చేతులు కట్టుకు నిల్చున్న నరేంద్ర మోదీ ఎక్కడ? అంటూ రాహుల్ ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన ఒక పాత వీడియోను షేర్ చేసి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.



**ట్రంప్ ఏమన్నారంటే?**

అసలు ఈ వివాదానికి కారణం మంగళవారం ట్రంప్ చేసిన వ్యాఖ్యలే. హౌస్ జీఓపీ రిట్రీట్‌లో ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌పై, మోదీపై సంచలన కామెంట్స్ చేశారు. “భారత్, రష్యా నుంచి ఆయిల్ కొంటోంది. అందుకే మేం వారిపై భారీగా పన్నులు వేశాం. ఆ పన్నుల వల్ల ప్రధాని మోదీ నాపై అంత సంతోషంగా లేరు“ అని ట్రంప్ అన్నారు. అంతటితో ఆగకుండా, “మోదీ నన్ను చూడటానికి వచ్చారు. ‘సార్, నేను మిమ్మల్ని కలవొచ్చా ప్లీజ్‘ అని అడిగారు. నేను సరే అన్నాను“ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఒక దేశ ప్రధానిని ట్రంప్ ఇలా చులకన చేసి మాట్లాడటం ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది.

**ఇందిరమ్మకు, మోదీకి తేడా ఇదే**

రాహుల్ గాంధీ ‘ఎక్స్‘ వేదికగా స్పందిస్తూ 1971 నాటి పరిస్థితులను గుర్తుచేశారు. గతంలో తాను మాట్లాడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన పోస్ట్ చేశారు. “1971 యుద్ధ సమయంలో అమెరికా మనల్ని తీవ్రంగా బెదిరించింది. ఏకంగా తన 7వ నౌకాదళాన్ని భారత్‌పైకి పంపింది. అయినా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా ఒత్తిడికి తలొగ్గలేదు. కొంచెం కూడా భయపడలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి ఏంటి? ట్రంప్ ఒక్క మాట అనగానే మోదీ వణికిపోయారు. లొంగిపోయారు. ఇందిరమ్మ ధైర్యానికి, ఇప్పటి మోదీ భయానికి ఉన్న తేడా ఇదే“ అని రాహుల్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

**కౌగిలింతల వల్ల ఏం వచ్చింది?**

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధానిపై సెటైర్లు వేశారు. “గతంలో ‘నమస్తే ట్రంప్‘ అన్నారు. అమెరికా వెళ్లి ‘హౌడీ మోదీ‘ అన్నారు. ‘డొనాల్డ్ భాయ్‘ అంటూ బలవంతపు కౌగిలింతలు ఇచ్చారు. ఇన్ని చేసినా చివరకు మిగిలిందేంటి? ఇప్పుడు ట్రంప్ మన ప్రధానిని ‘సార్, ప్లీజ్‘ అని అడిగించుకునే స్థాయికి దిగజార్చారు“ అని ఎద్దేవా చేశారు. సోషల్ మీడియాలో గొప్పలు చెప్పుకోవడం వల్ల దేశానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు.

**పన్నుల మోత, అపాచీ లేట్**

ట్రంప్ కేవలం మాటలతోనే కాదు, చేతల్లోనూ భారత్‌పై కఠినంగా ఉన్నారు. భారత్, రష్యా ఆయిల్ కొంటున్నందుకు గాను, అమెరికా ఏకంగా 50 శాతం పన్నులు విధించింది. ఇందులో 25 శాతం పన్నులు కేవలం చమురు కొనుగోళ్ల కోసమేనని ట్రంప్ స్పష్టం చేశారు. అలాగే అపాచీ హెలికాప్టర్ల అంశాన్ని కూడా ట్రంప్ ప్రస్తావించారు. “భారత్ 68 అపాచీ హెలికాప్టర్ల కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తోందని నాకు చెప్పారు. ఇప్పుడు మేం దాన్ని మారుస్తున్నాం“ అని తెలిపారు. మొత్తానికి అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు భారతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ వార్‌ను రాజేశాయి. ప్రధాని గౌరవాన్ని ట్రంప్ తగ్గించారంటూ కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది.

# ఏనుగుల బీభత్సం- ఒక్క రాత్రిలో ఆరుగురు మృతి

ఝార్ఖండ్ పశ్చిమ సింగభూమ్ జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. రోజురోజుకు గ్రామాలపై తిరగబడుతున్న ఘటనలు ఎక్కువైపోతున్నాయి. గత ఆరు రోజుల్లోనే ఏకంగా 15 మందికి పైగా మరణించారు. తాజాగా జెటాయ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్క రోజే ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జనవరి 6న బబారియా గ్రామంలో ఏనుగు చేసిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు ఇంటి బయట నిద్రపోగా రాత్రి 10 గంటల సమయంలో ఒక ఏనుగు అకస్మాత్తుగా వారి దాడి చేసింది. ఈ దాడి నుంచి ఒక చిన్నారి బయటపడగా మిగిలిన నలుగురు మరణించారు. పక్కింటి వ్యక్తి కుడా ఏనుగు దాడిలో మరణించారు. హటగమారియా ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఒక గ్రామస్థుడు మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు.

ఏనుగుల దాడిపై సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మరణించిన కుటుంబాలకు సంతాపం తెలిపిన అధికారులు, పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఏనుగుల దాడిలో మరణించిన వారిని బబారియా గ్రామానికి చెందిన సంతాన్ మేరాల్, అతడి భార్య జోంకో కుయి, ఇద్దరు పిల్లలుగా గుర్తించారు. మరొక వ్యక్తిని మోగ్డా లగురిగా అధికారులు గుర్తించారు.



**అటవీ శాఖ బృందాలు పెట్రోలింగ్**

ఏనుగుల దాడి ఘటనపై జిల్లా అటవీ అధికారి ఆదిత్య నారాయణ్ స్పందించారు. ఆరుబయట నిద్రపోకూడదని అనేక సార్లు అవగాహన కల్పించినా, కొందరు అలాగే పడుకుంటున్నారని అన్నారు. అందువల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అటవీ శాఖ బృందాలు పెట్రోలింగ్ చేస్తున్నాయని వివరించారు. డ్రోన్లు సహా ఇతర పద్ధతుల ద్వారా ఏనుగుల కదలికలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అయితే, ఏనుగులు చాలా వేగంగా సంచరించే ప్రాంతాలను మారుస్తున్నాయని, వీటిని కనిపెట్టడమే ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. ఈ క్రమంలోనే ఏనుగులను నియంత్రించేందుకు బంగాల్ నుంచి ప్రత్యేక బృందాలను పిలిపించినట్లు వివరించారు. వీరితోపాటు వంతారా వైల్‌లైఫ్ కన్జర్వేషన్ సంస్థను సంప్రదించామని చెప్పారు.

**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి**

అంతకుముందు సోమవారం రాత్రి కూడా గోలికెరా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏనుగులు దాడి చేశాయి. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. సోవా గ్రామానికి చెందిన కుంద్రా బాదా కుటుంబం ఇంటి బయట నిద్రపోతుండగా ఏనుగు దాడి చేసింది. అప్రమత్తమైన కుటుంబసభ్యులు తప్పించుకునేందుకు ప్రయత్నించగా, కుంద్రా సహా కుమార్తె కోడ్మా, కుమారుడు సాము ముగ్గురు మరణించారు. కుంద్రా భార్య మాత్రం ప్రమాదం నుంచి బయటపడింది. మరో కుమార్తె జింగి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఏనుగుల దాడి ఘటనపై సమాచారం అందుకున్న అటవీ అధికారుల ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబానికి రూ. 20,000 తక్షణ ఆర్థిక సాయం అందించారు. ఇంకా ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఏనుగులు సంచరింపు ఎక్కువ కావడం వల్ల అడవి పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు. తమ గ్రామాలకు ఏనుగుల తాకిడి ఎక్కువ కావడంతో తమకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# రష్యా నుంచి భారత్‌కు..
# రూ.15 లక్షల కోట్ల చమురు దిగుమతి

ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే అప్పటినుంచి 144 బిలియన్ యూరోల (రూ.15 లక్షల కోట్ల విలువైన) క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంది. దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది. ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడించింది. అలాగే ఫిబ్రవరి, 2022 (యుద్ధం మొదలైన ఏడాది) నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా వేసింది. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో చైనా తర్వాత మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి



40 శాతానికి చేరింది. ఇక చైనా 210.3 బిలియన్ యూరోల చమురును కొనుగోలు చేసిందని సీఆర్‌ఈఏ వెల్లడించింది. గ్యాస్, బొగ్గు దిగుమతులతో కలిపి ఆ మొత్తం 293.7 బిలియన్ యూరోలుగా ఉందని తెలిపింది.

**రూ.46 వేల కోట్ల బంగారం.. స్విట్జర్లాండ్‌కు తరలించిన మదురో..!**

ఈ దిగుమతులపై అమెరికా దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతోన్న సంగతి తెలిసిందే. ఈ కొనుగోళ్ల ద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు భారత్ ఆర్థికంగా సహకరిస్తుందని మిత్ర దేశాలు ఆరోపించాయి. పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆయిల్ ఉత్పత్తిదారులైన లుకోయిల్, రాస్‌నెఫ్ట్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. భారత్‌పై నిందలు మోపిన ఐరోపా యూనియన్ దేశాలు.. ఈ నాలుగేళ్లలో రష్యా శిలాజ ఇంధనాల దిగుమతులపై 218.1 బిలియన్ యూరోలు వెచ్చించడం గమనార్హం.

# గ్రీన్‌లాండ్ స్వాధీనం.. పరిశీలనలో సైనిక ఆప్షన్: వైట్‌హౌస్

గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగంగా మారాల్సిందేనని, అది తమ జాతీయ భద్రతకు అవసరమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం పునరుద్ఘాటించింది. దానిపై నియంత్రణ సాధించేందుకు తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని, వాటిల్లో సైన్యాన్ని వాడే అంశం కూడా పరిశీలనలో ఉందని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మకంగా కీలకమైందని, ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణ అవసరమని అధ్యక్షుడు భావిస్తున్నారన్నారు. ఆ లక్ష్యం దిశగా ముందుకువెళ్లడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలించాలని తన బృందానికి సూచించారని చెప్పారు. వెనెజువెలా నేత నికోలస్ మదురోను సైనిక ఆపరేషన్ ద్వారా అమెరికా కస్టడీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి గ్రీన్‌లాండ్ పేరు వార్తల్లో వినిపిస్తోంది. ఇంకో 20 రోజుల్లో మాట్లాడదామంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేయడం, గతంలో ఆయన ప్రభుత్వంలో పనిచేసిన కేటీ మిల్లర్ ‘త్వరలో (గూూచీ)’ అనే పోస్టు పెట్టడం కలకలం రేపుతున్నాయి. దీంతో ఈ ద్వీపాన్ని అమెరికా (ఖూూ) తన నియంత్రణలోకి తీసుకుంటుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఐరోపా దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. వ్యూహాత్మక, ఖనిజాలతో నిండి ఉన్న ఈ ఆర్కిటిక్ ద్వీపంపై హక్కు అక్కడి ప్రజలకే ఉంటుందని మద్దతుగా నిలిచిన




సంగతి తెలిసిందే.

## కుక్కలు కరిచే మూడ్‌లో ఉన్నాయని ముందే ఎవరూ ఊహించలేరు

వీధి కుక్కల వివాదంపై చేపట్టిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్నిఅవి దగ్గరకు వచ్చేంతవరకు ఎవరూ ఊహించలేరని పేర్కొంది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. వీధి కుక్కలను తరలించే అంశంపై అత్యున్నత ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. అటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లలో కుక్కకాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీచేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. జాతీయ రహదారులపై తిరుగుతున్న పశువులను కూడా షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించింది.ల

## కాంగ్రెస్ తో బీజేపీ పొత్తు.. ‘మహా’ నేతలపై సీఎం ఫడ్నవిస్ ఆగ్రహం



మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహారాష్ట్రలోని అంబర్ నాథ్ మున్సిపాలిటీలో అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ బీజేపీ, అటు కాంగ్రెస్ తోపాటు, ఎన్సీపీతో కలిసి అంబర్ నాథ్ వికాస్ అఘాఢి పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డట్లు తెలుస్తోంది. దీని ద్వారా శివసేనకు చెక్ పెట్టేందుకు ఆయా పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అలాగే అకోలా జిల్లాలోని అకోటా మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ, ఎంఐఎం పొత్తు పెట్టుకున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ఇలా రెండు చోట్ల బీజేపీ.. అటు కాంగ్రెస్, ఇటు ఎంఐంతో పొత్తు పెట్టుకోవడంపై శివసేన వంటి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మున్సిపల్ సీట్లు దక్కించుకునేందుకు స్థానికంగా ప్రత్యర్థి పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంపై మహాయుతి కూటమి నేత, రాష్ట్ర సీఎం ఫడ్నవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా, పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఇలా పొత్తులు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై పూర్తి వివరాలు సేకరించేందుకు పార్టీ నేతలకు ఆదేశాలిచ్చామన్నారు. 60 సీట్లున్న అంబర్ నాథ్ లో బీజేపీ-కాంగ్రెస్-ఎన్సీపీ కూటమికివ 31 సీట్లు ఉండగా, అత్యధిక స్థానాలు (27) ఉన్న శివసేనకు అధికారం దూరమవుతుంది. దీంతో బీజేపీ తరఫున తేజశ్రీ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. ఈ పరిణామంపై ఉద్ధవ్ ఆధ్వర్యంలోని శివసేన ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి పొత్తు ధర్మాన్ని బీజేపీ విస్మరించి, అనైతిక చర్యలకు పాల్పడుతోందని శివసేన విమర్శించింది. మరోవైపు ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. తమ పార్టీ కూటమిలో లేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

## నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్



ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో నెతన్యాహు, ఇజ్రాయెల్ దేశ ప్రజలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇద్దరు నాయకులు కూడా తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. “నా స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం గురించి మేము చర్చించాం. ప్రాంతీయ పరిస్థితులపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నాం. ఉగ్రవాదాన్ని మరింత దృఢ సంకల్పంతో ఎదుర్కోవాలనే మా ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాం.“ అని మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు

పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.



ధర్మఘంట

# సంక్రాంతికి టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

**హైదరాబాద్:** సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ ఏడాది సంక్రాంతికి పండుగకు 6431 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 18, 19 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పందల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది.

**2003లో జీవో ప్రకారం ఛార్జీల పెంపు..**

ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 రేట్ల వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 రేట్ల వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్‌గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.

**ఆ బస్సుల్లో ఉచిత ప్రయాణం..**

ఈ సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 రేట్లు వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10, 12,13 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 18, 19 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను ఏఏఏ.ఠీఊతీఆష.ఱఅ వెబ్ సైట్‌లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సూచించింది.

**601 సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం**

సాధారణ బస్సులు రెగ్యులర్ ఛార్జీలే వసూలు చేస్తారు. అయితే కొన్ని ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉండొచ్చు. ఇక ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రం ఈ పండగ వేళలో ఛార్జీలు రెండింతలు చేస్తారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం యథావిధిగా కొనసాగుతుంది. ప్రయాణికులు రద్దీని దృష్టి పెట్టుకుని దాదాపు 601 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉంది. దీని ద్వారా ప్రయాణికులకు సీటు గ్యారెంటీపై ఆర్టీసీ భరోసా కల్పించింది. రిజర్వేషన్ టికెట్ల బుకింగ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లను సంప్రదించాలని సూచిస్తున్నారు.

**ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు**

పండక్కి వెళ్తున్నారు? బాగానే ఉంది. మరి తిరుగు ప్రయాణం సంగతేంటి? అందుకు భయమే అవసరం లేదు. పండగ తర్వాత ప్రయాణానికి సైతం ప్రయాణికుల సౌలభ్యం కోసం జనవరి 16 నుంచి 20 వరకు 569 సర్వీసులను ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ బస్సులు 236, సాధారణ బస్సులు 333 ఉన్నాయి. ఇందులో గరిష్ఠ రద్దీ రోజులుగా అంచనా వేస్తూ 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు ఒక్కోరోజు 156 బస్సుల చొప్పున నడపనున్నారు. తిరుగు ప్రయాణంలో 18వ తేదీన అత్యధికంగా 173 బస్సుల అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

**హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు**

జనవరి 9 నుంచి 15 వరకు ప్రత్యేక బస్సుల అందుబాటులో ఉంటాయి. మొత్తం 818 సర్వీసులు నడపాలని అధికారులు షెడ్యూల్ ని రూపొందించారు. వీటిలో 365 సర్వీసులకు రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. మిలిగిన 453 సాధారణ సర్వీసులను ఏర్పాటు చేశారు.

**సంక్రాంతికి రైళ్లు సర్వీసులు ఇలా**

ఈ సంక్రాంతి నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు అదనపు ప్రత్యేక రైళ్లను కేటాయించారు. ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా 11 ప్రత్యేక సర్వీసులను నడపనున్నారని రైల్వే చీఫ్ కమిర్షియల్ ఇన్‌స్పెక్టర్ డి.రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమై ఈ నెల 25వ తేదీ వరకు నడుస్తాయన్నారు. ఇప్పటికే ఈ రైళ్లకు సంబంధించి టికెట్ రిజర్వేషన్లు ప్రారంభించారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు రైల్వేస్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

# కార్నర్‌లో కార్...

**హైదరాబాద్ :** నిన్నమొన్నటి వరకు ఆమె టార్గెట్ హరీశ్‌రావు. అప్పుడప్పుడు కేటీఆర్‌పై అటాక్. మధ్యలో సంతోష్‌పై సెటైర్లు. కానీ ఇప్పుడు అక్క..డైరెక్ట్‌గా గులాబీ బాస్‌పైనే బాణాలు ఎక్కుపెడుతోంది. పెద్ద సార్ టార్గెట్‌గానే..ఇంకా చెప్పాలంటే కల్వకుంట్ల ఫ్యామిలీ లక్ష్యంగానే ఆమె రాజకీయ పోరాటం ఉండబోతుందన్నది చెప్పకనే చెప్పేస్తోంది. కానీ కవిత కామెంట్స్‌పై కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి మాత్రం నో రియాక్షన్. కవిత రోజు రోజుకు డోస్ పెంచుతున్నా బీఆర్ఎస్ కీలక నేతలెవరూ స్పందించడం లేదు. ఇదే ఇప్పుడు కారు పార్టీలో హాట్ టాపిక్‌గా మారుతోంది.కారులో ఉన్నప్పుడే అందరినీ కార్నర్ చేసింది. ఒక్క అధినేతను వదిలిపెట్టి.. హరీశ్, కేటీఆర్, సంతోష్‌ను..వరుసపెట్టి అటాక్ చేస్తూ వచ్చింది కవిత. ఇక బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాక..ఆమె విమర్శల దాడి ఇంకా ఎక్కువైంది. ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులే టార్గెట్‌గా ఆరోపణలు చేస్తూ వస్తున్నారు కవిత.అయినా హరీశ్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ ఆమె కామెంట్స్‌పై అస్సలు రియాక్ట్ కావడం లేదు. లేటెస్ట్ మండలి వేదికగా కవిత మాట్లాడిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ముఖ్యనేతలందరిపైనా విమర్శలు చేస్తూ వస్తున్న కవిత ఇప్పుడు మరింత స్పీడ్ పెంచారు. మొన్నటివరకు కేసీఆర్ దేవుడని, తన హీరో అని చెప్పిన కవిత..ఇప్పుడు ఆయనపైన ఇండైరెక్ట్ అటాక్ చేయడం చర్చకు దారితీస్తోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు నేరుగా తీసుకోకపోయినా ఆయనపై విమర్శలు చేశారు కవిత. శాసనమండలి సాక్షిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనపై సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయం అంటూ పరోక్షంగా కేసీఆర్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేశారు కవిత. తెలంగాణను ఏం ఉద్ధరించామని టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాలకు వెళ్లారంటూ మండలిలో ఉచ్చరించకూడని భాషతో తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నించారామె.కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ, పాలనపై కవిత చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముందు హరీశ్‌రావు, తర్వాత కేటీఆర్, ఇప్పుడు నేరుగా అధినేత కేసీఆర్‌ను అంటే మొత్తం కేసీఆర్ ఫ్యామిలీనే కవిత టార్గెట్ చేస్తున్నా..వాళ్లేవరు ఆమె కామెంట్స్‌పై ఎందుకు స్పందించడం లేదన్నది బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎదురవుతున్న ప్రశ్న.కవిత వ్యాఖ్యలు, ఆమె చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీకి ఎంతో కొంత నష్టాన్ని కలిగిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారట. ఆమె శాసన మండలిలో కన్నీళ్లు పెట్టుకుని మరీ అధినేత కేసీఆర్ సహా పార్టీపై, తొమ్మిదిన్నరేళ్ల పాలనపై ఆరోపణలు చేయడంపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కవిత ఇంతలా సీరియస్ కామెంట్స్ చేసినా..అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు రియాక్ట్ కావడం లేదన్నది బీఆర్ఎస్ నేతలకు, క్యాడర్‌కు అంతుచిక్కడం లేదట.కవిత వ్యాఖ్యలపై పార్టీ నుంచి ఎంత మంది మాట్లాడినా ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు స్పందిస్తే ఎఫెక్ట్ వేరేగా ఉంటుందని చర్చించుకుంటున్నారట. లేకపోతే బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఇదే సమయంలో కవిత ఆరోపణలను అధినేత కేసీఆర్ కాకపోయినా కనీసం కేటీఆర్, హరీశ్‌రావు ఖండించకపోతే పార్టీకి నష్టం జరగడంతో పాటు ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు అస్త్రాలుగా మారతాయన్న ఆందోళన వ్యక్తమవుతోందటపార్టీ మహిళా నేతలతో కవితకు కౌంటర్ ఇప్పించినా అది ప్రజల్లోకి వెళ్లదని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఆమె ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి వాళ్లు సమాధానం చెప్తేనే బాగుంటుందన్న ఒపీనియన్స్ వస్తున్నాయట. అయితే కవిత అంతలా ఫ్యామిలీ మెంబర్స్‌ను టార్గెట్ చేస్తున్నా వాళ్లు మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యం వేరే ఉందన్న టాక్ వినిపిస్తోంది. కవిత ఎంత కాదనుకున్నా తమ కుటుంబ సభ్యురాలేనని, అధినేత కేసీఆర్ కూతురు కాబట్టి..ఆమె ఎన్ని ఆరోపణలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావు మౌనంగా ఉండాల్సి వస్తోందట.కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో లేకున్నా తమ ఫ్యామిలీ మెంబరే కావడంతో ఆమెపై తాము మాట్లాడటం సరికాదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కవిత ఇలా అధినేత కేసీఆర్‌పైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నా మౌనంగా ఉంటే బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో పాటు జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో కవిత దూకుడు ఎలా ఉంటుందో..బీఆర్ఎస్ రియాక్షన్ ఇంకెలా ఉంటుందో వేచి చూడాలి.




## ఎన్నికలకు సిద్ధమవుతున్న పురపాలికలు

**రంగారెడ్డి :** మేడ్చల్ జిల్లాలో మున్సిపాలిటీలలో ఎన్నికల కొలాహలం మొదలైంది. జిల్లాలో ఎన్నికలు జరుగుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నప్పటికీ అధికారులు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లాలో కేవలం మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఇటీవల ఏర్పడ్డాయి.గతంలో జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్ లు, 9 మున్సిపాలిటీలో ఉండేవి. ఇవి రింగురోడ్డు లోపల, రింగ్ రోడ్డు ని ఆనుకొని ఉండడంతో ప్రభుత్వం ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. అంతకుముందు జిల్లాలోని గ్రామపంచాయతీలన్నీ మున్సిపాలిటీలలో విలీనం చేసింది. రింగ్ రోడ్డు బయట ఉన్న గ్రామాలను కలిపి ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నందున ఇవి కూడా జిహెచ్ఎంసి లో కలుస్తాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండడంతో పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మూడు మున్సిపాలిటీలలో ఓటరు జాబితా ముసాయిదాలు వెల్లడించారు. ఓటరు జాబితా పై ఈ నెల 5 వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే రోజు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలలో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీల గుర్తులతో జరుగుతాయి. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ అవసరం. దీంతో ఆయా పార్టీల నియోజకవర్గ బాధ్యులను కలిసి తమ అంతరంగాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీలు మేడ్చల్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఎల్లంపేట, మూడు చింతలపల్లి లలో 24 వార్డులు చొప్పున, అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి.పోటీ చేయాలనుకునేవారు గ్రౌండ్ వరకు కూడా చేసుకుంటున్నారు. పార్టీల నాయకులు సైతం కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు హరి వర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ నిర్వహించారు. వీరు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల క్రితం ఎంపీ ఈటెల రాజేందర్ బిజెపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అందరూ ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో రిజర్వేషన్లపై ఉత్కంఠ ఏర్పడింది. ఈ మూడు కొత్త మున్సిపాలిటీలలో చైర్మన్ పదవి, వార్డ్ మెంబర్ పదవులు ఏ కేటాగిరికి రిజర్వేషన్ అవుతుందనే విషయంలో ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ సస్పెన్స్ ఉన్నప్పటికీ ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని భావిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..
## మరో ఇద్దరికి సిట్ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

మరికొందరికి సిట్ నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ నేతలకు నోటీసులు – మరో చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధం

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణలో సిట్ దూకుడు పెంచింది. తాజాగా విచారణకు హాజరుకావాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ తండ్రి కొండలరావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. అతనితో పాటు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావుకు సైతం నోటీసులు జారీ చేసింది. నేడు విచారణకు హాజరు కావల్సి ఉండగా నవీన్ రావు తండ్రి కొండలరావు గైర్హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా తన నివాసంలోనే విచారణకు సిద్ధమని సిట్ అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కుమారుడు సందీప్ రావు విదేశాల్లో ఉన్నట్లు సిట్‌కి తెలిపినట్లు తెలుస్తోంది. వీరితో పాటు మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకు కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలకు నోటీసులు ఇచ్చింది. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

**నవీన్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును జనవరి 4న సిట్ సుదీర్ఘంగా ప్రశ్నించింది. గులాబీ పార్టీ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాలపైనా ఆరా తీసింది. దాదాపు 9 గంటల పాటు సాగిన విచారణలో గతంలో బీఆర్ఎస్ పార్టీకి సమకూరిన ఎలక్టోరల్ బాండ్ల అంశంపైనా ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

**గతంలో అడిగిన విషయాలనే మరోసారి**

ఆయనకు నోటీస్ ఇచ్చి 2024 సెప్టెంబర్ 24న వాంగ్మూలం నమోదు చేశారు. తాజాగా మరోసారి ఆయన్ని విచారించడం ప్రాధాన్యం సంతరించుకొంది. అప్పటి విచారణలో సరైన సమాచారం లభించలేదనే భావనతోనే సిట్ మరోసారి నవీన్ రావు వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలిసింది. గతంలో అడిగిన విషయాలనే మరోసారి సిట్ అధికారులు అడిగారని ఎమ్మెల్సీ నవీన్ రావు తెలిపారు. బయట ప్రచారం జరుగుతున్నట్లు తానే ట్యాపింగ్ పరికరాలను సమకూర్చాననే విషయంలో ఎలాంటి ప్రశ్నలు అడగలేదని, అలాంటి ప్రస్తావనే రాలేదని స్పష్టం చేశారు.

**సిట్ కాస్తా కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లాగా అయిపోయింది**

ఫోన్ ట్యాపింగ్ కేసును ఇంకా ఎన్నాళ్లు సాగదీస్తారని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఎంతమందిని పిలిచి విచారణ చేసినా వేళ్లన్నీ ఒకవైపే చూపిస్తున్నాయని, వేళ్లన్నీ ఒకరివైపే చూపినా ఆయన జోలికి వెళ్లటం లేదని అన్నారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేస్తారా అని స్వయంగా కుమార్తె ప్రశ్నించిందని తెలిపారు. సిట్ కాస్తా కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లాగా అయిపోయిందని విమర్శించారు. 650 మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని సర్వీస్ ప్రొవైడర్లే చెప్పారని అన్నారు. కుటుంబంలో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటామని, బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు భారమైందిఆ పార్టీతో ఉపయోగం లేదని రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ఆ కుటుంబ సభ్యులకే నచ్చటం లేదని, కాంగ్రెస్ పార్టీపై ప్రజలు నమ్మకం కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని ధీమా వ్యక్తం చేశారు.

## క్వార్టర్స్‌లో నెగ్గాం..
## సెమీస్, ఫైనల్లోనూ మనదే గెలుపు

**ఖమ్మం:** ఎగవేతలు, కూల్చివేతలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని.. అందుకే ఆ పార్టీని తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన నూతన సర్పంచ్‌ల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు.

క్వార్టర్ ఫైనల్‌లో(సర్పంచ్ ఎన్నికలను ఉద్దేశించి..) మంచి ఫలితాలు వచ్చాయి. సెమీ ఫైనల్ లో మంచి ఫలితాలు వస్తాయి. చివరికి ఫైనల్ లో విజయం మనదే. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు చెబుతున్నారు. పాలిచ్చే గేదెను వదులుకొని.. తన్నే దున్నపోతు ను గెలిపించారని నేను వారితో చెప్పా. అయిపోయింది ఏదో అయిపోయింది.. వచ్చేది బీఆర్ఎస్ అని రైతులు నాతో చెప్పారు. రైతులు ఎంత క్లారిటీగా ఉన్నారో అర్థమైంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాల్లేవ్. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్‌ల్లో ఎలా వస్తుంది?.. కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. లక్ష కోట్ల బడ్జెట్ అన్నారు.. ఏమైంది?. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా?. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా?. రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది?.. కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం..

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ మగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకొండనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారం లో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయిన గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు?.. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఓటమికి రంగం సిద్ధమైంది. సర్పంచ్ ఎన్నికల్లో 40 శాతం పదవులు గెలుచుకున్నాం. ఇక్కడే రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వచ్చిందో తెలుస్తోంది. త్వరలో జగరబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదు. ఖమ్మం నుంచి 7 నుంచి 8 స్థానాలు గెలుస్తాం అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఆర్థిక భరోసాకు పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఇందిరమ్మ చీరల పథకం వంటి కార్యక్రమాల ద్వారా నిరంతర పని కల్పిస్తోంది.

**టెస్కో ద్వారా భారీ కొనుగోళ్లు**

చేనేత కార్మికులకు మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు టెస్కో ద్వారా ప్రభుత్వం నేరుగా వస్త్రాలను కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.587 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కార్మికులకు నేరుగా ఆదాయం అందేలా ప్రభుత్వం అడుగడుగునా చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా చేనేత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నేతన్నల సంక్షేమమే తమ ప్రాధాన్యతని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు.

## కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం
## మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**హైదరాబాద్:** కవిత వచ్చి విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని.. ఆమె విషయంలోనూ అదే జరిగిందన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు. "రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదు. జనాభా ప్రాతిపదికన జరిగిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదు" అని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

ధర్మఘంట

# ఉదయాన్నే తిన్నారనుకోండి!



శీతాకాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఫైబర్, ఐరన్ లాంటి ముఖ్య పోషకాలతో నిండి ఉంటుంది. కీళ్ల నొప్పులు, అలసట, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.శీతాకాలంలో ఎండు ఖర్జూరం తినొచ్చా.? లేదా.? ఇది అందరిలోనూ ఉండే ప్రశ్న. ఈ వింటర్ సీజన్‌లో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎండు ఖర్జూరం ఎముకలను బలంగా మార్చడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరిచడంలో సహాయపడుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా చలికాలంలో కొన్ని ప్రత్యేకమైన డ్రై ఫ్రూట్స్ తీసుకుంటే శరీరానికి మరింత శక్తి, రోగనిరోధక శక్తి లభిస్తాయి. అలాంటి వాటిలో ఎండు ఖర్జూరం ఒకటి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి లాంటి కీలక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా చలికాలంలో వచ్చే ఎముకల నొప్పులు, జీర్ణ సమస్యలు, అలసట లాంటి సమస్యలకు ఎండు ఖర్జూరం మంచి ఔషధంలా పనిచేస్తుంది. చలికాలంలో చాలామందికి నడుము నొప్పి, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎండు ఖర్జూరం చాలా ఉపయోగపడుతుంది. రాత్రి ఒక గ్లాసు నీటిలో రెండు ఎండు ఖర్జూరాలు, ఒక చెంచా మెంతులు నానబెట్టి ఉంచి.. ఉదయం లేచిన వెంటనే ఖర్జూరాలను నమిలి తిని, ఆ నీటిని వడగట్టి తాగాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే శరీరంలోని నొప్పులన్నీ క్రమంగా తగ్గుతాయి. ఎప్పుడూ అలసటగా ఉండటం, శరీరంలో శక్తి లేకపోవడం లాంటి సమస్యలు ఉంటే ఎండు ఖర్జూరం మంచి పరిష్కారం. రాత్రి పూట లేదా ఉదయం ఎండు ఖర్జూరం తినడం వల్ల శరీరానికి ఎనర్జీ వస్తుంది. అలాగే ఐరన్ అధికంగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య ఉన్నవారికి ఇది ఎంతగానో ఉపయోగకరం. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, రక్తహీనత లక్షణాలైన అలసటను తగ్గిస్తుంది. చలికాలంలో ఛాతిలో కఫం చేరడం, దగ్గు, జలుబు లాంటి శ్వాస సంబంధిత సమస్యలు సర్వసాధారణం. రెండు ఎండు ఖర్జూరాలను బాగా నమిలి తిని, తర్వాత కొద్దిగా గోరువెచ్చని నీరు తాగితే కఫం కరిగి బయటకు రావడంలో సహాయపడుతుంది. తద్వారా శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ బలపడుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. క్రమం తప్పకుండా ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల పేగులు ఆరోగ్యంగా పనిచేస్తాయి. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ఎండు ఖర్జూరం కీలకపాత్ర పోషిస్తుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె పనితీరును బలోపేతం చేస్తుంది. అలాగే, రోగనిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల నుంచి శరీరం రక్షణ పొందుతుంది. చలికాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం శరీరానికి చాలా మంచిది. రోజు పరిమిత మోతాదులో తీసుకుంటే శక్తి, ఆరోగ్యం రెండు మెరుగవుతాయి. అయితే, మధుమేహం ఉన్నవారు మాత్రం వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది.

## ఆయిల్ పుల్లింగ్ చేస్తే ఇన్ని లాభాలా..?




ఆయిల్ పుల్లింగ్ అనేది పురాతన ఆయుర్వేద పద్ధతి. నోటి ఆరోగ్యం, తెల్లటి దంతాలు, మంచి శ్వాస కోసం ఇది ప్రాచుర్యం పొందుతోంది. సెలబ్రిటీలు కూడా దీనిని అనుసరిస్తున్నారు. నోటిలోని హానికరమైన బ్యాక్టీరియాను తొలగించి, చిగుళ్ల సమస్యలు, దుర్వాసన తగ్గిస్తుంది. కొబ్బరి లేదా నువ్వుల నూనెతో 15 నిమిషాలు పుక్కిలించడం సరైన మార్గం. ఇది మానసిక ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. చాలా మంది దంతాలు, చిగుళ్ళకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటారు. ఇది క్రమంగా వారి మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. నోటి పరిశుభ్రతను కాపాడుకోవడం అనేది శరీరంలోని మిగిలిన భాగాలను జాగ్రత్తగా చూసుకోవడం ఎంత ముఖ్యమో, మంచి ఆరోగ్యానికి కూడా అంతే ముఖ్యం. అందువల్ల, ఈ రోజు మనం ఆయిల్ పుల్లింగ్ లేదా నూనెతో పుక్కిలించడం గురించి మీకు చెప్పబోతున్నాం. మీ సమాచారం కోసం, ఇది దంతాలు మరియు చిగుళ్ళను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే పురాతన ఆయుర్వేద పద్ధతి అని మీకు తెలియజేద్దాం. ఇది నోటి బ్యాక్టీరియాను తగ్గిస్తుంది మరియు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ సందర్భంలో, ఈ రోజు మనం ప్రతి ఉదయం ఆయిల్ పుల్లింగ్ యొక్క ప్రయోజనాలు మరియు సరైన పద్ధతి గురించి మీకు చెప్పబోతున్నాం. ప్రఖ్యాత యోగా గురువు మరియు రచయిత్రి డాక్టర్ హంసా యోగేంద్ర తన యూట్యూబ్ ఛానెల్‌లోని వీడియోలో ఈ సమాచారాన్ని పంచుకున్నారు. ఆయిల్ పుల్లింగ్ గుర్తుందా..? దాదాపుగా అందరికీ గుర్తుండే ఉంటుంది.. ఈ పురాతన ఆయుర్వేద పద్ధతి ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందుతోంది. చాలా మంది సెలబ్రిటీలు ప్రస్తుతం దీని గురించి ప్రస్తావించారు. బాలీవుడ్ గ్లామరస్ హీరోయిన్ శిల్పా శెట్టితో సహా చాలా మంది తారలు ఈ పద్ధతిని పాటిస్తారు. ఈ ఆయుర్వేద పద్ధతిలో నోటిలో నూనె పోసుకుని, కొన్ని నిమిషాలపాటు పుక్కిలిస్తారు. ఆపై దానిని ఉమ్మివేయాలి. ఇది మీ దంతాలు, చిగుళ్ళను శుభ్రపరచడమే కాకుండా నోటి దుర్వాసనను తొలగిస్తుంది. అంతేకాదు..ఆయిల్ పుల్లింగ్ మానసిక ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆయిల్ పుల్లింగ్ గురించి చాలా వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, మానసిక ఆరోగ్యాన్ని కూడా పెంచుతుందని, మీ ముఖానికి మెరుపును తెస్తుందని అంటున్నారు. ప్రతి రోజు ఉదయాన్నే ఆయిల్ పుల్లింగ్ చేయటం వల్ల నోటిలోని హానికరమైన బ్యాక్టీరియాను క్రమంగా తగ్గిస్తుంది. తత్ఫలితంగా ఇది నోటి దుర్వాసన, పంటి, చిగుళ్ల నొప్పి, వాపు, ఇన్ఫెక్షన్ల వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. మీకు నోటి దుర్వాసన సమస్య ఉంటే మీరు ప్రతిరోజూ ఆయిల్ పుల్లింగ్ ప్రయత్నించవచ్చు. ఇది దుర్వాసన కలిగించే బ్యాక్టీరియా, టాక్సిన్స్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. మీ శ్వాసను తాజాగా మారుస్తుంది. పసుపు దంతాలను వదిలించుకోవడానికి క్రమం తప్పకుండా ఆయిల్ పుల్లింగ్ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది క్రమంగా దంతాలను తెల్లగా, ప్రకాశవంతంగా చేస్తుంది.

## ఏ టిఫిన్ బాక్స్ ఆరోగ్యానికి మంచిది?



మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి సరైన టిఫిన్ బాక్స్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ప్లాస్టిక్ బాక్స్‌లు హానికరమైన రసాయనాలను విడుదల చేసి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. కాబట్టి మంచి టిఫిన్ బాక్సులు ఎంచుకోవడం బెటర్. సాధారణంగా మనం ఆరోగ్యంగా ఉండాలని పోషకాలున్న ఆహారాన్ని వండుకుంటాం. కానీ ఆ ఆహారాన్ని దేనిలో తీసుకెళు_న్నాం అనే విషయాన్ని మాత్రం పట్టించుకోం. మార్కెట్‌లో దొరికే రంగురంగుల డిజైన్లు, తక్కువ ధర చూసి మనం ఎంచుకునే టిఫిన్ బాక్స్‌లు మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సాధారణంగా భారతీయ ఇళ్లలో ఎక్కువగా కనిపించే స్టీల్ టిఫిన్లే అత్యంత సురక్షితమైనవి. ఇవి రసాయన రహితం, మన్నికైనవి, తేలికగా ఉంటాయి. ఆహారం రుచిని, పోషకాలను ఇవి మార్చవు. వీటిని మైక్రోవేవ్‌లో పెట్టలేము. ద్రవ పదార్థాల కోసం లీక్-ప్రూఫ్ మూతలు ఉన్న వాటినే ఎంచుకోవాలి. స్కూలుకు వెళ్లే పిల్లలకు, ఆఫీసులకు వెళ్లే వారికి ఇది అత్యంత ఉత్తమమైన ఎంపిక. ఆధునిక జీవనశైలిలో గాజు టిఫిన్ల వినియోగం పెరుగుతోంది. గాజు రసాయన రహితమైనది. ఆహారం వాసన రాకుండా ఉంటుంది. ఆఫీసుల్లో నేరుగా మైక్రోవేవ్‌లో వేడి చేసుకోవడానికి ఇది వీలుగా ఉంటుంది. ఇవి బరువుగా ఉంటాయి. కింద పడితే విరిగిపోయే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా వాడగలిగే పెద్దలకు, ఆఫీసు ఉద్యోగులకు ఇది మంచిది. పాత కాలంలో ఇత్తడి పాత్రలనే వాడేవారు. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. ఇత్తడిలో ఆహారం ఉంచడం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజాలు అందుతాయి. ఇది బాక్టీరియా పెరగకుండా చూస్తుంది. నిమ్మకాయ, టమోటా వంటి ఆమ్ల ఆహారాలతో ఇత్తడి ప్రతిచర్య జరుపుతుంది. అలాగే వీటిని శుభ్రం చేయడం, మెరిసేలా చూసుకోవడం కాస్త కష్టమైన పని. ఇంట్లో ఉండేవారికి, చిన్న ప్రయాణాలు చేసే వారికి ఇది అనుకూలం. చౌకగా దొరుకుతాయని ప్లాస్టిక్ బాక్సుల వైపు వెళ్లడం ఆరోగ్యానికి చేటు. బరువు తక్కువ, రంగురంగుల డిజైన్లలో లభిస్తాయి. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్‌లో ఉంచినప్పుడు అది హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. ఇది దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. అత్యవసరమైతే తప్ప ప్లాస్టిక్ వాడకపోవడమే మంచిది.



# ప్రతి రోజూ టమోటా తింటే ఏమవుతుంది?

టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? అన్ని కూరగాయల్లో కెల్లా టమాటాది ప్రత్యేక స్థానం. ఎందుకంటే.. వంట ఏదైనా సరే.. టమాటా లేనిదే అసంపూర్ణం అని చెప్పాలి. వివిధ రకాల కూరగాయలు, సలాడ్‌లతో సహా అనేక వంటలలో ఉపయోగిస్తారు. టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, చర్మం, జీర్ణవ్యవస్థకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో పేరుకుపోయిన మలినాలు బయటకు పోతాయి. రోజూ పచ్చి టమాటా తింటే బీపీ తగ్గడంతో పాటు కొలెస్ట్రాల్ లెవెల్స్ కంట్రోల్ లో ఉంటాయి. ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. టమాటాలో విటిన్ సి ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరగడానికి ఇది చాలా కీలకం. టమాటా యాంటీ ఆక్సిడెంట్ లా కూడా పని చేస్తుంది. బాడీ సెల్స్ డ్యామేజ్ కాకుండా అడ్డుకుంటుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. స్కిన్ ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. టమాటాతో జీర్ణ శక్తి పెరుగుతుంది. అందుకు కారణం ఏంటంటే..టమాటాలో ఫైబర్ అధికంగా ఉంటుంది. టమాటాలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను బలంగా ఉంచుతుంది. బ్లడ్ క్లాటింగ్ లేకుండా చూస్తుంది.

ధర్మఘంట

# మంత్రులపై అసంతృప్తి!

**మంచిర్యాల :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికార పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రావడం.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్‌ల కంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ బలపరిచిన వారు అధిక స్థానాల్లో గెలవడంపై అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో 50 శాతం నుంచి 60 శాతం మధ్యలో సర్పంచ్ స్థానాలు గెలిస్తే, ఆయన ఇన్‌చార్జిగా ఉన్న ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో పార్టీ రెండో స్థానంలో నిలవడం చర్చనీయాంశంగా మారింది. ఇక ఉమ్మడి జిల్లాలో మరో మంత్రి వివేక్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ 50 శాతానికి కంటే తక్కువ సర్పంచ్ స్థానాల్లో గెలిచింది. రాష్ట్రంలో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏ నియోజకవర్గంలో లేని విధంగా చెన్నూర్‌లో అత్యధికంగా 32 స్థానాల్లో ఇండిపెండెంట్ సర్పంచ్‌లు గెలిచారు. నియోజకవర్గంలో 98 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు 48 గ్రామాల్లోనే గెలిచారు. మంత్రి వివేక్ ఇన్‌చార్జిగా ఉన్న సిద్దిపేట జిల్లాలోనూ అధికార పార్టీకి చుక్కెదురైంది. రాష్ట్రంలో మంత్రుల నియోజకవర్గాలవారీగా చూసుకుంటే అటు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, ఇటు వివేక్ ఇద్దరూ ఇతర మంత్రుల కంటే వెనుకబడి ఉండడంపై పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. దీంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లితోపాటు మంత్రి వివేక్ విషయంలో పార్టీ పెద్దలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నది.

### సీరియస్‌గా తీసుకోలేదా..

అటు ఇన్‌చార్జి మంత్రి, ఇటు మంత్రి సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోకపోవడమే ప్రతికూల ఫలితాలకు కారణమంటూ సొంత పార్టీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇద్దరు మంత్రులు ఉండి ఏం చేశారంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గస్థాయి నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన వారిని కాదని వేరే వారిని సర్పంచ్‌లుగా బలపరిచారని, అందుకే మంత్రి వివేక్ ప్రచారం చేసిన గ్రామాల్లోనూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు ఓడిపోయారనే చర్చ నడుస్తున్నది. మంత్రి సీరియస్‌గా తీసుకోకుండా చెన్నూర్, క్యాతన్‌పల్లికి చెందిన ఇద్దరు షాడో ఎమ్మెల్యేలకు అధిక ప్రయార్టీ ఇవ్వడం, వాళ్లు చెప్పిన వారినే సర్పంచ్ అభ్యర్థులుగా బలపర్చడం అసలు మోసానికి వచ్చిందంటున్నారు. ఇక ఇన్‌చార్జి మంత్రి జూపల్లి తీరుపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార కార్యక్రమాలు తప్ప పార్టీ బలోపేతం దిశగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని, అసలు ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు తీసుకొని ఆరెడు నెలలు అవుతున్నా.. మంచిర్యాల జిల్లాలోనే పర్యటించలేదని ఆ పార్టీ



నాయకులు మండిపడుతున్నారు. ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి పట్టింపులేని కారణంగానే సర్పంచ్ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మున్సి'పల్స్' కష్టమే..

మంత్రులు ఇదే పద్ధతుల్లో ముందుకు వెళ్తే మున్సిపల్ ఎన్నికల్లో జనాల పల్స్ పట్టుకోవడం కష్టమనే చర్చ ఉమ్మడి జిల్లాని కాంగ్రెస్ పార్టీలో వినిపిస్తున్నది. మంచిర్యాల జిల్లాలో ఓ మున్సిపాలిటీలో కౌన్సిలర్ టికెట్లను అధికార పార్టీ లీడర్ ఒకరు బేరం పెట్టినట్లు, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు ఇచ్చిన వారికే టికెట్లు అని ప్రచారం జరుగుతున్నది. ఇలాంటి పరిస్థితి ఉంటే మున్సిపల్ ఎన్నికల్లోనూ చేతులు ఎత్తేయడం కాయమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మంత్రులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, టికెట్ల కేటాయింపును షాడోలకు వదిలేయకుండా స్వయంగా మానిటరింగ్ చేసి, క్షేత్రస్థాయిలో రియాల్టీ తెలుసుకొని ఇవ్వాలని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. ముందు నుంచి పార్టీనే పట్టుకొని ఉన్నవారికి టికెట్లు ఇవ్వకపోతే రెబల్స్‌గా పోటీ చేస్తున్నారని, దాంతో ఓట్లు చీలిపోతున్నాయని సర్పంచ్ ఎన్నికల్లోనూ ఇదే జరిగిందంటున్నారు. ఇన్‌చార్జి మంత్రి, మంత్రి ఇప్పటి నుంచి మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో పార్టీకి ఇబ్బందులు తప్పవని క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కేడర్ చర్చించుకుంటున్నారు.

### ముఖ్య నేతల రాజీనామా?

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగలనుందని ప్రచారం జరుగుతున్నది. పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌ల్లో కొందరు పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సర్పంచ్‌లతోపాటు పార్టీ సీనియర్ లీడర్లు ఇదే ఆలోచనలో ఉన్నట్లు చెప్తున్నారు. ముందు నుంచి పార్టీనే పట్టుకొని ఉన్న వారిని కాదని, కొత్తగా వచ్చిన వారికి ప్రయార్టీ ఇవ్వకపోవడం, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, గ్రామాల్లో ఎక్కడికి వెళ్లిన జనాలు వ్యతిరేకత వెళ్లగక్కుతుండంతో పార్టీని వదలాలని కొందరు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ లీడర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను పార్టీలోకి తీసుకొచ్చి ఆయన్ని మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెడుతారంటూ సోషల్ మీడియాలో ఓ సందేశం చక్కర్లు కొడుతున్నది. పైగా సదరు నాయకుడు శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో ఉన్నాడని, ఆయన భూముల రక్షణ కోసం కాంగ్రెస్‌లో చేరి, మున్సిపల్ చైర్మన్ కావాలని చూస్తున్నారంటున్నారు. అలాంటి వాళ్లను పార్టీలో ప్రోత్సహిస్తే చూస్తూ ఊరుకునేది లేదంటూ హస్తం పార్టీ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా పార్టీకి రాజీనామా చేస్తే అది ఎన్నికలపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశాలున్నాయి. ఇదంతా తప్పుడు ప్రచారమని, సర్పంచ్‌లు, ముఖ్య నేతలు ఎవ్వరూ రాజీనామాలు చేయడం లేదంటూ ఆ పార్టీ పెద్దలు చెప్తున్నారు. దీంతో చెన్నూర్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది.

# ఇక్కడ ఇన్..చార్జులే!

**రంపచోడవరం:** పోలవరం జిల్లా ఏర్పాటు జరిగి ఐదు రోజులైంది.. ఇప్పటి వరకూ ఆరుగురు అధికారుల బాధ్యతల స్వీకరణ జరిగింది.. ఇందులో ఐదుగురు ఇన్‌చార్జులుగా, ఒక్కరు పూర్తి బాధ్యతలు స్వీకరించారు.. అయితే పూర్తి స్థాయిలో అధికారులను నియమించాల్సిన అవసరాన్ని మరిచారు.. ఇదే కొనసాగితే కొత్త జిల్లాకు ఇబ్బంది తప్పదు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి రంపచోడవరం నియోజకవర్గాన్ని వేరు చేసి ముంపు మండలాలతో, కొత్త జిల్లాగా పోలవరం ఏర్పాటైంది. దీంతో ఐదు రోజులుగా ఒక్కొక్కరుగా అధికారులు బాధ్యతలు చేపడుతున్నారు. పోలవరం జిల్లా ప్రకటించిన తరువాత గత ఏడాది డిసెంబర్ 31న అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు కొత్త జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే జాయింట్ కలెక్టర్ (జేసీ)గా పాడేరు ఐటీడీఏ పీఓ, ఏఎస్ఆర్ జిల్లా జేసీ తిరుమణి శ్రీపూజ, అల్లూరు సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్‌ను జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా వేశారు. అలాగే రంపచోడవరం డీడీఓగా పనిచేస్తున్న కోటేశ్వరరావును జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారిగా, ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న



డాక్టర్ సరితకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పోలవరం జిల్లా ట్రెజరీ అధికారిగా సత్యనారాయణ శనివారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈయన ఒక్కరే పూర్తి స్థాయి జిల్లా అధికారి కావడం గమనార్హం.

### సర్దు'పాట్లు' లేకుండా చూడాలి

ఇంకా అనేక కీలకమైన శాఖలకు అధికారులను నియమిస్తారా.. లేక ఇన్‌చార్జ్ బాధ్యతలతో సర్దుబాటు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది. కొత్త జిల్లా ఏర్పాటు జరగక ముందే ప్రణాళికాబద్ధంగా అధికారులను నియమించాలి. లేకుంటే ముందు ముందు ఇబ్బంది పడే అవకాశం వస్తోంది. మరి ఏం చేస్తారో వేచి చూడాల్సిందే.

పోలవరం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి గిరిజనుల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకూ అర్జీలు స్వీకరించారు. ఇక్కడ కలెక్టరేట్ కోసం తాత్కాలికంగా కేటాయించిన యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ) నుంచి ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. కొత్త జిల్లా కోసం తక్షణ నిధులు రూ. 5 కోట్ల వరకూ ప్రభుత్వం కేటాయించింది. వైటీసీలో అధికారులు విధులు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసిన తరువాత కొత్త కలెక్టరేట్ ప్రారంభించనున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయం కోసం ప్రాజెక్ట్ మానటరింగ్ రిసోర్స్ సెంటర్ (పీఎంఆర్‌సీ)ని కేటాయించారు. జిల్లా ట్రెజరీ కార్యాలయం కూడా అందులోనే ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఐటీడీఏ ప్రాంగణంలోనే కొనసాగుతుంది.

# రోడ్డు ప్రమాదాలకు ముకుతాడు

**కరీంనగర్ :** జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సీపీ గౌస్ ఆలం దృష్టి సారించారు. అతివేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం ద్వారా జరుగుతున్న ప్రమాదాలు, ప్రాణనష్టాలకు ముకుతాడు వేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం రోడ్డు భద్రతా మాసోత్సవాలు కొనసాగుతున్న తరుణంలో నగరంలో ప్రమాదాలకు కారణమవుతున్న పలు బ్లాక్‌స్పాట్లు, జంక్షన్లను గుర్తించారు. అత్యంత ప్రమాదకరమైన పద్మనగర్, సదాశివపల్లి, ఎన్టీఆర్ జంక్షన్లపై దృష్టి సారించారు. ఇప్పటికే పద్మనగర్ జంక్షన్ విస్తరించారు. రోడ్డు సేఫ్టీ, ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించి, సదాశివపల్లి వైజంక్షన్ వద్ద ఐలాండ్ నిర్మించేందుకు సీపీ చొరవ చూపించారు. ఇందుకోసం కొంత భూసేకరణ, ఐలాండ్ నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఇక్కడ ఐలాండ్ నిర్మించనున్నారు.

### ప్రమాదాల నేపథ్యంలో అవగాహనకు శ్రీకారం..

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో రెండేళ్లుగా రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గుతున్నా.. క్షతగాత్రుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాలకు వేగం ప్రధాన కారణమని గుర్తించిన అధికారులు, కూడళ్లకు సమీపంలో రంబుల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. యూటర్న్‌ల వద్ద యాక్సిడెంట్లు జరగకుండా బారికేడ్ల ఏర్పాటు, బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాద హెచ్చరికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రతీ ప్రాంతాన్ని సీపీ గౌస్ ఆలం స్వయంగా పర్యవేక్షించి తగిన సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా వేగం ఈ ప్రమాదాలకు ప్రథమ కారణం కాగా, అవగాహన లోపం రెండో కారణమని గుర్తించారు. జనవరి మొత్తం రోడ్డు భద్రతపై అవగాహన



కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వాహనదారులతోపాటు కాలేజీ యువతకు పలు కార్యక్రమాలు రూపొందించారు. ఈ కార్యక్రమాలకు కలెక్టర్ పమేలా సత్పతి కూడా హాజరవనున్నారు. కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. రోడ్‌సేఫ్టీ, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకెళ్తున్నాం. వేగంతోపాటు నిబంధనలు పాటించని వాహనదారుల వల్లే ప్రాణనష్టం సంభవిస్తుంది. మృతుల్లో అధికశాతం ద్విచక్రవాహనదారులే కావడం వల్ల హెల్మెట్ వినియోగం పెరిగేలా, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై అవగాహన కలిగేలా చర్యలు రూపొందించాం

## బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలి..

### టీఆర్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం సంజీవ్



**ధర్మారం :** వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం బీసీ సబ్ ప్లాన్ ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌ఫీ) జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం సంజీవ్ కోరారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని ఆయన కోరారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీల కోసం సబ్ ప్లాన్ ను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసి తీరాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండల సోషల్ మీడియా కన్వీనర్ ముత్తునూరి అంజి బాబు, భూపల్లి ప్రసాద్, ముత్యాల శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోచ్‌లు లేని క్రీ'డల్'!




**ఆదిలాబాద్:** క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు క్రీడా విధానాలను ప్రకటిస్తూనే క్షేత్రస్థాయిలో శీతకన్ను వేస్తున్నాయి. క్రీడాకారులకు ఆడాలనే ఆసక్తి ఉన్నా పలు ప్రాంతాల్లో మైదానాలు అందుబాటులో లేవు. మైదానాలు అందుబాటులో ఉన్న చోట శిక్షకులు లేరు. అరకొర నైపుణ్యాలతో క్రీడల్లో రాణించలేని దుస్థితిలో క్రీడాకారులున్నారు. దీంతో ఎంతోమంది ఎన్నో క్రీడాంశాల్లో తడబాటుకు గురై క్రీడలను అర్ధంతరంగా వదిలేస్తున్నా రు. క్రీడారంగాన్ని ఎంచుకుంటే భవిష్యత్ ఉంటుందో, లేదోనని తల్లిదండ్రులు కూడా చాలామందిని క్రీడల వైపు పంపించేందుకు సంశయిస్తున్నారు.

### నామమాత్రంగా డీఎస్ఏ..

జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేయాల్సిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ)నామమాత్రంగా తయారైంది. క్రీడల అభివృద్ధికి నామమాత్రంగా నిధులు వస్తున్నాయని, కార్యాలయాల నిర్వహణకే ఉద్యోగులు పరిమితమవుతున్నారనే అభిప్రాయం క్రీడాకారుల్లో వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలో విశాలమైన ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ఉంది. ఈ క్రీడా మైదానానికి నిత్యం ఎంతోమంది క్రీడాకారులు వస్తుంటారు. అయితే వీరికి నేర్పించడానికి శిక్షకులు లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. తాము స్వయంగా ఎంత సాధన చేసినా ఫలితం ఉండడంలేదని వాపోతున్నారు. శిక్షకులుంటే నైపుణ్యాలు అలవర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని భావిస్తున్నారు. తాత్కాలిక శిక్షకులను ఏర్పాటు చేయాల్సిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం కూడా భవిష్యత్ క్రీడాకారులకు శాపంగా మారుతోంది. క్రీడా పాఠశాలలో ఉన్న శిక్షకులు క్రీడా పాఠశాల విద్యార్థులకే శిక్షణ ఇస్తున్నారు. దీంతో క్రీడాభివృద్ధిపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.


### ప్రైవేట్ సంస్థల వైపు చూపు

అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు తాము ఇష్టపడే క్రీడలో రాణించేందుకు ప్రైవేట్ శిక్షణ సంస్థల వైపు దృష్టిస్తారిస్తున్నారు. నిరుపేద క్రీడాకారులు మా త్రం స్టేడియంలోనే ఎవరికి వారే పట్టుదలతో సాధ న చేస్తున్నారు. ఎగువ మధ్యతరగతి, ధనిక కుటుంబాల నేపథ్యం నుంచి వస్తున్న కొంతమంది క్రీడాకా రులు డబ్బులు చెల్లిస్తూ ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో త ర్ఫీదు పొందుతున్నారు. పిల్లల ఆసక్తిని ప్రోత్సహించడానికి కొందరు నిరుపేద తల్లిదండ్రులూ అప్పు చేసి ప్రైవేట్ శిక్షణ కేంద్రాలకు పంపుతున్నారు.

### ఆదాయ వనరులపైనే ఫోకస్

స్టేడియంలో శిక్షకుల నియామకంలో వెనుకడుగు వే స్తున్న డీఎస్ఏ ఆదాయం సమకూర్చుకోవడంలో మాత్రం ముందుచూపుతో వ్యవహరిస్తోంది. స్వి మ్మింగ్ పూల్ నిర్వహణను కాంట్రాక్టర్ చేతికిచ్చి ఆ దాయం పొందుతోంది. దుకాణాసముదాయం నుంచి వస్తున్న అద్దె, జిమ్, ఇండోర్ స్టేడియం నుంచి వస్తున్న ఫీజులతో ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇక స్విమ్మింగ్, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ సాధ న చేయాలనుకునే క్రీడాకారులు వాటికి దూరమవుతున్నారు. కనీసం తాత్కాలిక శిక్షకులను నియమించి తమను ప్రోత్సహించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

## తెలంగాణ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డికి పలువురి పరామర్శ



**కథలాపూర్ :** కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్‌మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి లోక బాపురెడ్డి తల్లి నర్సవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్మడ లక్ష్మీనరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. నర్సవ్వ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట జగిత్యాల మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు, ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మఘంట

## బిజినెస్

# రిలయన్స్ షేరుకు రష్యా చమురు సెగ

### తగ్గనున్న రష్యా చమురు దిగుమతులు



ఈ ఏడాది జనవరిలో రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ దిగ్గజ రిలయన్స్ ఇండస్ట్రీస్ రష్యా చమురు డెలివరీలు ఉంటాయని అనుకోవట్లేదని ప్రకటన విడుదల చేయడమే ఇందుకు నేపథ్యం. దీంతో ఈ నెలలో చమురు దిగుమతులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇటీవల రిలయన్స్ సంస్థ రష్యా చమురును దిగుమతి చేసుకుంటోందని గ్లోబల్ మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్ కథనం తెలిపింది. సుమారు 22 లక్షల బ్యారెళ్ల రష్యా చమురు ఉన్న మూడు నౌకలు రిలయన్స్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీ వైపు వెళ్లాయని, జనవరిలో డెలివరీ అవుతాయని పేర్కొంది. దీనిపై స్పందించిన సంస్థ, అటువంటిదేమీ లేదని, తమపై తప్పుడు కథనాలు వెలువడుతున్నాయని, అసత్యాలతో సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగళవారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. గడిచిన మూడు వారాల్లో జామ్‌నగర్ రిఫైనరీకి ఎలాంటి రష్యా నౌకలు రాలేదని, జనవరి నెలకు సంబంధించిన డెలివరీలను కూడా తిరస్కరించామని స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు వ్యవహారంలో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. సుంకాలను మరింత పెంచవచ్చని ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్ కథనం వెలువడం రిలయన్స్ సంస్థ అధికారిక ప్రకటన ద్వారా స్పష్టత ఇచ్చింది.

### 2025లో 8 శాతం పెరిగిన వాహన రిటైల్ అమ్మకాలు



దేశీయ వాహన పరిశ్రమలో రిటైల్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయని ఆటోమొబైల్ డీలర్ల సంఘం ఫాడా ప్రకటనలో వెల్లడించింది. 2025లో దేశవ్యాప్తంగా మొత్తం 2,81,61,228 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. ఇది 2024లో అమ్ముడైన 2,61,45,445 యూనిట్లతో పోలిస్తే 7.71 శాతం అధికం. దీనికి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ 2.0 సంస్కరణలు భారీ అమ్మకాలకు దోహదపడ్డాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్(ఫాడా) అభిప్రాయపడింది. మొత్తం అమ్మకాల్లో ప్యాసింజర్ కార్ల అమ్మకాలు 40,79,532 యూనిట్లతో 9.7 శాతం వృద్ధి చెందాయి. ఆ తర్వాత టూవీలర్ విభాగంలో 2,02,95,650 యూనిట్లు(7.24 శాతం వృద్ధి), త్రీ-వీలర్ రిటైల్ అమ్మకాలు 13,09,953 యూనిట్లు(7.21 శాతం వృద్ధి), కమర్షియల్ వాహనాల విభాగం 10,09,654 యూనిట్ల(6.71 శాతం వృద్ధి) విక్రయాలు నమోదయ్యాయి. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్నుల ఉపశమనం, 2025 ఏడాది పొడవునా ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్ల కోత వంటి కీలక చర్యలు అమ్మకాలకు మద్దతిచ్చాయని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ అన్నారు. గతేడాది ప్యాసింజర్ వాహనాల విక్రయాలకు గ్రామీణ మార్కెట్ ఎక్కువ సహకారం అందించింది. ఈ విభాగంలో పట్టణ ప్రాంత అమ్మకాలు 8 శాతం పెరగ్గా, గ్రామీణ ప్రాంతాల్లో 12 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో దాదాపు 33 శాతం సీఎన్‌జీ, హైబ్రిడ్లు, ఈవీ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు ఉన్నాయి. సీఎన్‌జీ అమ్మకాలు 18 శాతం నుంచి 21 శాతానికి పెరగ్గా, ఈవీలు 2.4 శాతం నుంచి 4 శాతానికి పెరిగాయి. అయితే హైబ్రిడ్లు 8.7 శాతం నుంచి

అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ముడి చమురు దిగుమతి చేసుకుంటోందంటూ వచ్చిన వార్తల సెగ మంగళవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు తగిలింది. ముడిచమురు నుంచి ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ వంటి వాటిని ఐరోపా దేశాలకు ఆర్‌ఐఎల్ ఎగుమతి చేస్తుంటుంది. ఆయా దేశాల ఆంక్షలను ఆర్‌ఐఎల్ ఉల్లంఘించినట్లుగా వచ్చిన వార్తలను సంస్థ ఖండించినా, స్టాక్‌మార్కెట్లో షేరు 4 శాతానికి పైగా నష్టపోయి, సంస్థ మార్కెట్ విలువ ఒకేరోజు రూ.94,000 కోట్లకు పైగా క్షీణించింది. ఐరోపా దేశాల ఆంక్షల అనంతరమూ రష్యా నుంచి తాము ముడిచమురును దిగుమతి చేసుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఐరోపా కూటమి విధించిన ఆంక్షలకు అనుగుణంగా, గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్ద ఉన్న తమ రిఫైనరీలో రష్యా ముడిచమురు వాడటాన్ని 2025 నవంబరు 20న ఆపేశామని రిలయన్స్ తెలిపింది. ఇంతకుముందు రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేసే భారతీయ సంస్థగా ఆర్‌ఐఎల్ ఉంది. జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో రెండు రిఫైనరీలున్నాయి. సెజ్ యూనిట్లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను ఐరోపా కూటమి, అమెరికా, ఇతర విపణులకు సంస్థ ఎగుమతి చేస్తోంది. రెండోదైన పాత యూనిట్‌లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను భారతీయ విపణికి ఆర్‌ఐఎల్ సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరు 1 నుంచి రష్యాయేతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి చమురునే వాడుతున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. డేటా అనలటిక్స్ సంస్థ కెప్లేర్ నివేదికను ఉటంకిస్తూ.. 2.2 మిలియన్ బ్యారెళ్ల ఉరాల్స్‌తో (రష్యా ముడి చమురులో ఓ రకం) కూడిన మూడు ట్యాంకర్లు సిక్కా ఓడరేవు దిశగా వెళ్లాయని బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం తెలిపింది. జామ్‌నగర్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌కు సరఫరా అయ్యే ముడి చమురులో అత్యధికం ఈ ఓడరేవు ద్వారానే వస్తుందని పేర్కొంది. అయితే సిక్కా ఓడరేవును రిలయన్స్‌తో పాటు మిగతా సంస్థలూ వాడుతుంటాయి. ఈ వార్తా కథనంలో చెబుతున్న మూడు ఓడల ద్వారా వచ్చిన ముడి చమురు, భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (బీపీసీఎల్)కు చెందిన బినా రిఫైనరీ కోసమై ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

# ఎగుమతిదారుల్లో పెరిగిన ఆందోళన



భారత్‌పై ట్రంప్ అధిక టారిఫ్‌ల భయాలు మరింత పెరిగాయి. ఈ ఏడాది వేసవి కాలానికి గాను అమెరికాకు సరుకులను పంపించే ఎగుమతిదారుల్లో ఆందోళన నెలకొంది. భారత ఉత్పత్తులపై 50 శాతం అధిక టారిఫ్‌లతో అటు ఫ్యాక్టరీల్లోనూ, ఇటు కంపెనీ బోర్డు రూముల్లోనూ తీవ్ర ఒత్తిడి నెలకొందని రిపోర్టులు వస్తోన్నాయి.. భారతీయ వస్తువులపై అమెరికా విధించిన భారీ సుంకాలు, పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో రాబోయే సీజన్ ఆర్డర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు.అమెరికా మార్కెట్‌ను వదులుకోలేక, భారతీయ సరఫరాదారులు తమ లాభాలను పణంగా పెడుతున్నారని జాతీయ మీడియాలో కథనాలు వస్తోన్నాయి. చాలా మంది ఎగుమతిదారులు సుమారు 20 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తుండగా, అమెరికా కొనుగోలుదారులు తమ మార్జిన్‌లను 7-8 శాతం తగ్గించుకున్నారని అంచనా. ఇతర దేశాల నుండి వచ్చే వస్తువులపై అమెరికా 15-20 శాతం సుంకాలు విధిస్తుంటే, భారతీయ ఉత్పత్తులపై ఏకంగా 50 శాతం వరకు టారిఫ్‌లను వేస్తోన్న విషయం తెలిసిందే. ఇంతటి భారీ భారాన్ని ఎక్కువ కాలం భరించడం అసాధ్యమని ఎగుమతిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోలు, దుస్తులు, పాదరక్షల రంగాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఒకవేళ వాణిజ్య ఒప్పందం కుదరకపోతే అమెరికా కొనుగోలుదారులు వియత్నాం లేదా బంగ్లాదేశ్ వంటి ఇతర దేశాల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఇది లక్షలాది మంది ఉపాధిపై ప్రభావం చూపనుందని వాణిజ్యవేత్తలు, ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. అమెరికాతో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎగుమతిదారులు ఇప్పుడు ఐరోపా వైపు చూస్తున్నారు. యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు జరుగుతున్నప్పటికీ, అది కార్యరూపం దాల్చడానికి, ప్రయోజనాలు అందడానికి మరికొన్ని నెలల సమయం పట్టవచ్చని ఆ వర్గాలు అంచనా వేస్తోన్నాయి.

## టీ20 ప్రపంచకప్ 2026కు

# న్యూజిలాండ్ జట్టు ప్రకటన

## స్పోర్ట్స్

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యుల న్యూజిలాండ్ జట్టును ఇవాళ (జనవరి 7) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా మిచెల్ సాంట్నర్ ఎంపికయ్యాడు. ఉపఖండపు పరిస్థితుల దృష్ట్యా న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు స్పిన్ హెవీ టీమ్‌ను ఎంపిక చేసింది. జట్టులో నలుగురు స్పిన్నర్లకు (సాంట్నర్, బ్రేస్‌వెల్, ఫిలిప్స్, రచిన్) అవకాశం కల్పించింది. ఆర్సీబీ స్టార్ బౌలర్, గతేడాది లీడింగ్ వికెట్ టేకర్ జేకబ్ డఫీ తొలిసారి ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. కైల్ జేమీసన్ ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపికయ్యాడు. ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. లాకీ ఫెర్గూసన్, మ్యాట్ హెన్రీ పితృత్వ సెలవుల కారణంగా కొన్ని మ్యాచ్‌లు మిస్ అవుతారు. వీరిద్దరు గాయాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు.

ఈ జట్టుకు ఎంపికైన మరో ముగ్గురు (ఫిన్ అలెన్, మార్క్ చాప్‌మన్, సాంట్నర్) కూడా గాయాల నుంచి కోలుకునే క్రమంలో ఉన్నారు. కాగా, ప్రపంచకప్‌లో న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, కెనడా, సౌతాఫ్రికా, యూఏఈ గ్రూప్-డిలో ఉన్నాయి. న్యూజిలాండ్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 8న చెన్నైలో ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడుతుంది. దీనికి ముందు న్యూజిలాండ్ భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడుతుంది.




ఈ సిరీస్‌ల్లో భాగంగా జనవరి 11 నుంచి మూడు వన్డేలు జరుగుతాయి. తొలి వన్డే వడోదరలో.. రెండో వన్డే రాజ్‌కోట్‌లో (జనవరి 14), మూడో వన్డే ఇండోర్‌లో (జనవరి 18) జరుగనున్నాయి. అనంతరం జనవరి 21 నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది. జనవరి 21, 23, 25, 28, 31 తేదీల్లో నాగ్‌పూర్, రాయ్‌పూర్, గౌహతి, వైజాగ్, తిరువనంతపురం వేదికలుగా టీ20లు జరుగనున్నాయి. ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో నలుగురిని మార్చి ప్రపంచకప్ జట్టును ఎంపిక చేసింది.

**టీ20 ప్రపంచకప్‌కు న్యూజిలాండ్ జట్టు**

- మిచెల్ సాంట్నర్ (కెప్టెన్)
- ఫిన్ అలెన్
- మైఖేల్ బ్రేస్‌వెల్
- మార్క్ చాప్‌మన్
- డెవాన్ కాన్వే
- జేకబ్ డఫీ
- లాకీ ఫెర్గుసన్
- మ్యాట్ హెన్రీ
- డారిల్ మిచెల్
- ఆడమ్ మిల్నే
- జేమ్స్ నీషమ్
- గ్లెన్ ఫిలిప్స్
- చిన్ రవీంద్ర
- టిమ్ సీఫర్ట్
- ఇష్ సోధీ

ట్రావెలింగ్ రిజర్వ్: కైల్ జేమిసన్

### తొలి శతకంతోనే చరిత్రపుటల్లోకెక్కిన ఇంగ్లండ్ యువ ఆటగాడు




సిడ్నీ వేదికగా జరుగుతున్న యాషెస్ చివరి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ యువ ఆటగాడు జేకబ్ బేతెల్ సెంచరీతో కదంతొక్కాడు. 22 ఏళ్ల బేతెల్‌కు టెస్ట్‌ల్లో ఇది తొలి శతకం. ఈ శతకంతో అతడు రికార్డుపుటల్లోకెక్కాడు. ఆస్ట్రేలియాపై 22 ఏళ్లలోపు శతకం చేసిన తొమ్మిదో ఇంగ్లండ్ బ్యాటర్ అయ్యాడు. ఈ జాబితాలో జానీ బ్రిగ్స్, జాక్ హెర్న్, పటౌడి, కాలిన్ కౌడ్రే, డేవిడ్ గోవర్, మైక్ అథర్టన్, అలిస్టర్ కుక్, బెన్ స్టోక్స్ ఉన్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. బేతెల్ తన అద్భుత శతకంతో ఇంగ్లండ్‌ను ఆధిక్యం దిశగా నడిపించాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఏడు డాట్ బాల్స్ ఆడిన బేతెల్ వెబ్‌స్టర్ బౌలింగ్‌లో బౌండరీ కొట్టి సెంచరీ పూర్తి చేశాడు (162 బంతుల్లో). బేతెల్ సెంచరీ చేసిన అనంతరం అక్కడే మైదానంలో ఉన్న అతని కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నాలుగో రోజు చివరి సెషన్ సమయానికి బేతెల్ 131 పరుగుల వద్ద ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నాడు. అతనికి జతగా బ్రైడన్ కార్స్ (11) క్రీజ్‌లో ఉన్నాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసి పోరాడుతుంది. బేతెల్ పుణ్యమా అని ఆ జట్టు 107 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. ఈ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో బేతెల్ మినహా ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. డకెట్, బ్రూక్ తలో 42 పరుగులు చేయగా.. జేమీ స్మిత్ 26, జాక్ క్రాలే 1, రూట్ 6, స్టోక్స్ 1, విల్ జాక్స్ డకౌటయ్యారు. ఆసీస్ బౌలర్లలో వెబ్‌స్టర్ 3 వికెట్లు పడగొట్టగా.. స్టార్క్, బోలాండ్, నెసర్ తలో వికెట్ తీశారు. అంతకుముందు హెడ్ (163), స్టీవ్ స్మిత్ (138) సెంచరీలతో కదంతొక్కడంతో ఆసీస్-తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగుల భారీ స్కోర్ చేసింది. మిగతా బ్యాటరల్లో వెబ్‌స్టర్ 71 (నాటౌట్), వెదర్లాడ్ 21, లబూషేన్ 48, మైఖేల్ నెసర్ 24, కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్న ఉస్మాన్ ఖ్వాజా 17, అలెక్స్ క్యారీ 16, గ్రీన్ 37 , స్టార్క్ 5, బోలాండ్ డకౌయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్, టంగ్ తలో 3, స్టోక్స్ 2, జాక్స్, బేతెల్ తలో వికెట్ తీశారు. దీనికి ముందు జో రూట్ (160) సెంచరీతో సత్తా చాటడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (84) అర్ధ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో నెసర్ 4, స్టార్క్, బోలాండ్ తలో 2, గ్రీన్, లబూషేన్ చెరో వికెట్ తీశారు. కాగా,ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను ఆసీస్ ఇదివరకే 3-1 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

### వేదిక మార్పుపై బంగ్లాదేశ్ అభ్యర్థనను తిరస్కరించిన ఐసీసీ





ముంబై: టీ20 వరల్డ్‌కప్ లో భాగంగా భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు చెందిన వేదికలను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఐసీసీ, బీసీబీ మధ్య వర్చువల్ కాల్ జరిగింది. బంగ్లాదేశ్ చేసిన విన్నపాన్ని తిరస్కరించిన విషయం గురించి బోర్డుకు చెప్పినట్లు ఐసీసీ పేర్కొన్నది. వరల్డ్‌కప్‌లో ఆడాలంటే భారత్‌కు పర్యటించాల్సిందే అని, లేదంటే కీలకమైన పాయింట్లను కోల్పోతారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక సమాచారం లేదు. వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7వ తేదీన వెస్టిండీస్‌తో ఆడనున్నది. ఆ మ్యాచ్ కోల్‌కతాలో జరగాల్సి ఉన్నది. ఆ తర్వాత ఇంగ్లండ్, నేపాల్‌తో ఆడనున్నది. భద్రతా దృష్ట్యా భారత్‌లో పర్యటించమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చెప్పింది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి ఘటనలు పెరిగిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు బలహీనపడ్డాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ను తొలగించారు. దీంతో సమస్య మరింత జటిలమైంది.



## సంతోష్ శోభన్, మానస వారణాసి 'కపుల్ ఫ్రెండ్లీ' థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

టాలీవుడ్ యాక్టర్ సంతోష్ శోభన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్‌బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ మూవీని వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. సన్‌లైట్‌లో హీరోహీరోయిన్లు రొమాంటిక్ మూడ్‌లో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు పీ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్ మిడిల్ క్లాస్ కష్టాల నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. టీజర్‌లో నెల్లూరు కుర్రాడైన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ, సరైన ఉద్యోగం లేక చెన్నైలో కష్టాలు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్(రాపిడో లాంటివి) చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ప్రీతి (మానస వారణాసి) అతని బైక్‌లో ప్రయాణిస్తుంది. అలా అనుకోకుండా కలిసిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఎలా ప్రేమలో పడతారు..? ఆ తర్వాత ఏం జరిగింది..? అనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది. ల

## సమంత 'మా ఇంటి బంగారం' నుంచి సాలిడ్ అప్డేట్.. జనవరి 9న టీజర్ రిలీజ్‌కు రంగం సిద్ధం!




స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. ప్రధానంగా వెబ్ సిరీస్‌లపై ఎక్కువ ఫోకస్ పెట్టిన ఆమె, 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి ప్రాజెక్ట్‌లతో తన పరిధిని బాలీవుడ్, ఓటిటి వరకూ విస్తరించింది. ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితంలోనూ కొత్త చాప్టర్ ప్రారంభించి, ప్రొడ్యూసర్‌గా కూడా అడుగులు వేసింది. తెలుగులో ఇటీవల 'శుభం' సినిమాలో చిన్న క్యామియోతో ప్రేక్షకులను పలకరించిన సమంత నుంచి, పూర్తి స్థాయి సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ నిరీక్షణకు తెర దించుతూ, సమంత నటిస్తున్న క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'మా ఇంటి బంగారం' ఇప్పుడు మళ్లీ వార్తల్లోకి వచ్చింది. వాస్తవానికి ఈ సినిమాను చాలా కాలం క్రితమే ప్రారంభించారు. కానీ కొన్ని కారణాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యం అవుతూ వచ్చింది. ఇటీవల దర్శకురాలు నందిని రెడ్డితో కలిసి ఈ సినిమాను మళ్లీ పట్టాలెక్కించగా, ఇప్పుడు సమంత నుంచి అధికారికంగా సాలిడ్ అప్డేట్ వచ్చింది. తాజాగా విడుదలైన మాస్ పోస్టర్‌తో పాటు, ఈ సినిమా టీజర్ ను జనవరి 9న విడుదల చేయనున్నట్లు సమంత స్వయంగా ప్రకటించింది. ఈ పోస్టర్‌లో సమంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్‌లో కనిపించడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఇప్పటివరకు ఆమె చేసిన పాత్రలకు భిన్నంగా, ఈ చిత్రంలో పూర్తిగా క్రైమ్ యాక్షన్ నేపథ్యంలోని పాత్రలో కనిపించనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సినిమాకు కథను సమంత మాజీ భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడుమోరు అందించడం విశేషం. అలాగే ఈ ప్రాజెక్ట్‌ను సమంత స్వయంగా తన బ్యానర్‌లో నిర్మించడంతో, 'మా ఇంటి బంగారం' ఆమెకు ఎంతో ప్రత్యేకమైన చిత్రంగా మారింది. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటంతో, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు కంటెంట్ పరంగా కూడా బలంగా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. సమంత కెరీర్‌లో ఇది మరో కీలకమైన మలుపుగా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.మొత్తానికి, వెబ్ సిరీస్‌లతో గ్లోబల్ రీచ్ సాధించిన సమంత, ఇప్పుడు మళ్లీ తెలుగులో ఒక పవర్‌ఫుల్ థియేట్రికల్ ప్రాజెక్ట్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. జనవరి 9న విడుదలయ్యే టీజర్‌తో ఈ సినిమా పై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశముంది.



## పొంగల్ పోటీ.. పరాశక్తి కొత్త రిలీజ్ డేట్

సంక్రాంతి సినిమాల పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏడాది ముందుగానే కర్చీఫ్ వేయాల్సిందే. పొంగల్ బాక్సాఫీస్‌కు తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. అందుకే స్టార్స్ అంతా సంక్రాంతి రిలీజ్‌కు సిద్ధంగా ఉంటారు. ఇప్పటికే టాలీవుడ్ నుంచి వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాల డేట్స్ ఖరారయ్యాయి. వీటిలో ది రాజాసాబ్ జనవరి 9న, మనశంకరవరప్రసాద్ గారు జనవరి 12న, భర్త మహాశయులకు విజ్ఞప్తి జనవరి 13న, నారీ నారీ నడుమ మురారి, అనగనగా ఒక రాజు జనవరి 14న థియేటర్లలో సందడి చేయనున్నాయి. వీటికి తోడు కోలీవుడ్ సినిమాలు సైతం సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచాయి. అయితే కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్, శ్రీలీల నటించిన పరాశక్తి కూడా పొంగల్‌కే రానుంది. ఇప్పటికే ఈ మూవీ రిలీజ్ తేదీని కూడా ప్రకటించారు. జనవరి 14న విడుదల చేస్తామని ఫిక్సయ్యారు. అయితే తాజాగా రిలీజ్ తేదీ విషయంలో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు మేకర్స్. జనవరి 10న టాలీవుడ్ సినిమాలేవీ రిలీజ్ లేకపోవడంతో ఆ రోజే పరాశక్తి విడుదల కానుందని ప్రకటించారు. దీంతో ది రాజాసాబ్ రిలీజైన మరుసటి రోజే పరాశక్తి థియేటర్లకు రానుంది. విపరీతమైన పోటీ ఉన్న పొంగల్ బాక్సాఫీస్ వద్ద పరాశక్తికి థియేటర్లు ఎంతవరకు దొరుకుతాయో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న దళపతి విజయ్ జన నాయగన్ జనవరి 9న విడుదల కానుంది. కాగా.. ఈ సినిమాకు సుధా కొంగర దర్శకత్వం వహించారు

## బాలకృష్ణ-బోయపాటి కాంబోలో తొలి ఫ్లాప్ ఎన్బీకే 111 ప్రాజెక్ట్‌పై ప్రభావం



టాలీవుడ్ స్టార్ హీరో బాలకృష్ణ చివరగా 'అఖండ 2' చిత్రంతో ప్రేక్షకులని పలకరించిన విషయం తెలిసిందే. ఈ సినిమా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కగా, డిసెంబర్ 12న విడుదలైంది. బాలయ్య-బోయపాటి కాంబోతో గతంలో వచ్చిన 'సింహ', 'లెజెండ్', 'అఖండ' చిత్రాలు వరుస హిట్లు కొట్టగా, ఈసారి హ్యాట్రిక్ విఫలమైందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదలైన తొలి రోజు నుంచి మూవీ నెగటివ్ టాక్ ఎదుర్కొంది. భారీ బడ్జెట్‌తో నిర్మితమైనప్పటికీ, ఫలితంగా రెండు కోట్లకుపైగా నష్టాలు రికార్డ్ అయ్యాయని సమాచారం. మొత్తం వ్యాపారం రూ.103 కోట్లు ఊహించినప్పటికీ, గ్రాస్ కలెక్షన్స్ సుమారు రూ.120 కోట్లు, షేర్ వసూలు రూ.70 కోట్లు మాత్రమే. దీని ప్రభావంతో బయ్యర్లు ఇప్పుడు దర్శకుడు బోయపాటిపై కాస్త ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తుంది. 'అఖండ 2' ఫలితం బాలయ్య తదుపరి సినిమాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఎన్బీకే 111 ప్రాజెక్ట్ హోల్డ్‌లో ఉంది. ఈ సినిమా పీరియాడికల్, హిస్టారికల్ యాక్షన్ కాన్సెప్ట్‌తో, బాలయ్య ద్విపాత్రాభినయం చేస్తారని ప్రచారం. ఒక పాత్రలో రాజుగా, మరొక పాత్రలో యోధుడిగా కనిపించనున్నారు. అయితే 'అఖండ 2' పరాజయం కారణంగా సినిమా బడ్జెట్ తగ్గింపు, స్క్రిప్ట్ మార్పులు చేయడం ప్రారంభమైందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నారు. పీరియడ్, హిస్టరీ ఎపిసోడ్స్‌ని తగ్గించి, రెగ్యులర్ కమర్షియల్ మూవీలా మార్చే దిశలో పని జరుగుతోందని తెలుస్తోంది. కథ ఫైనల్‌గా పూర్తైతే సినిమా షూటింగ్ కొనసాగుతుందని, లేదంటే ప్రాజెక్ట్ రద్దు అయ్యే అవకాశం కూడా ఉందని సమాచారం. బాలయ్య, గోపీచంద్ మలినేని కాంబోలో చివరగా వచ్చిన 'వీర సింహారెడ్డి' సక్సెస్ తర్వాత, 'ఎన్బీకే 111' కోసం భారీ ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది.

## ఇద్దరు పిల్లల తల్లిని.. ఈ జనరేషన్‌కు నచ్చకపోవచ్చు!

తక్కువకాలంలో స్టార్‌డమ్ సంపాదించుకున్న హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. క్యూట్ ఫేస్‌తో, అమాయకపు చిరునవ్వుతో అందరినీ బుట్టలో వేసుకున్న ఈ బ్యూటీ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అని తేడా లేకుండా అంతటా సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె హీరోయిన్‌గా నటించిన 'పరాశక్తి' మూవీ సంక్రాంతి పండక్కి (జనవరి 10న) విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఓ ఆసక్తికర విషయాన్ని చెప్పుకొచ్చింది. తను ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న విషయం గురించి తొలిసారి స్పందించింది. శ్రీలీల మాట్లాడుతూ.. పిల్లల ప్రస్తావన వస్తే నాకు మాటలు రావు. వాళ్లు నాతో ఉంటే బాగుండేదనిపిస్తుంది. నాతో కలిసుండకపోయినా నేను వారిని బాగా చూసుకుంటున్నాను. కిస్ (2019) అనే కన్నడ మూవీ సమయంలో దర్శకుడు నన్ను ఓ ఆశ్రమానికి తీసుకెళ్లాడు. అక్కడే ఈ పిల్లలు ఉండేవారు. మేము ఫోన్‌లో మాట్లాడేవాళ్లం. వీలు దొరికినప్పుడల్లా అక్కడికి వెళ్లేదాన్ని. కానీ, ఈ విషయాన్ని నేను చాలాకాలం రహస్యంగా ఉంచాను. అయితే ఆ ఆశ్రమం వాళ్లు దీన్ని గోప్యంగా ఉంచడం దేనికి? మీరు బయటకు చెప్తేనే మిమ్మల్ని చూసి ఇంకో నలుగురైనా ముందుకొస్తారు అన్నారు. నిజమే కదా అనిపించింది. నేనేదో గొప్ప చేశానని చెప్పడం లేదు కానీ జనాలు కూడా ఆ దిశగా ఆలోచిస్తే బాగుంటుంది. అయితే ఈ జనరేషన్‌కు నాలాంటివాళ్లు నచ్చకపోవచ్చు. నేను మంచి గర్ల్‌ఫ్రెండ్ కాకపోవచ్చేమో! అయినా సరే.. నా తల్లి నన్నెంతగా ప్రేమిస్తుందో.. అదే ప్రేమను ఆ పిల్లలకు పంచుతున్నాను అని చెప్పుకొచ్చింది. కాగా శ్రీలీల 2022లో గురు, శోభిత అని ఇద్దరు దివ్యాంగులను దత్తత తీసుకుంది. 2025లో తన బర్త్‌డేకు ముందు ఓ పసిపాపను దత్తత తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. కానీ ఆ చిన్నారి తన మేనకోడలు అని శ్రీలీల క్లారిటీ ఇచ్చింది.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# ఘనంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు





**ధర్మఘంట, జనవరి 07, సూర్యాపేట**

సంగీతమే పరబ్రహ్మ స్వరూపమని నిరూపించిన మహనీయుడు త్యాగరాజ స్వామి అని సుధా బ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ నందు సుధా బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన త్యాగరాజ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. సంగీత త్రిమూర్తులలో ఒకరైన త్యాగరాజ జీవితం ఆదర్శనీయమన్నారు. శ్రీసీతారామునిపై అపార భక్తి, సంగీతంతో దైవాన్ని చేరవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయ కారుడని కొనియాడారు. సంగీతమే దైవంగా భావించి వేలాది కీర్తలను రచించి సంగీత ప్రపంచానికి మార్గనిర్దేశనం చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాదవపెద్ది సురేష్‌ను ఘనంగా సన్మానించారు. శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి ఎస్సీ కౌశిక్ కళ్యాణ్ బృందంచే పాడిన గాత్ర కచేరి పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మారుతి విద్యాసంస్థల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు సుధా బ్యాంకు నుంచి త్యాగరాజ చిత్రపటంకు నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులగం చిన్నారాయణ, సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, కక్కిరేణి చంద్రశేఖర్, పొనుగోటి నిర్మల, సందీప్, సుజాత, భోనగిరి భాస్కర్, అప్పం శ్రీనివాస్, శారద, పెద్దిరెడ్డి రాజా, పటేల్ నర్సింహారెడ్డి, శ్రవణ్, బొలిశెట్టి మధు, వెంకట్ రెడ్డి, తోట శ్యాం, అంజన్ ప్రసాద్, మిర్యాల సుధాకర్, రాచకొండ శ్రీను, కొత్త ఆంజనేయులు, గుండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏప్రిల్‌లో మరో విడత ఇందిరమ్మ ఇళ్ళు





### అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది

### రానున్న రెండు ఏళ్లలో మరో రెండు విడతలు

### హుజూర్ నగర్ లో మంత్రి ఉత్తమ్ తో కలిసి పర్యటించిన మంత్రి పొంగులేటి

**ధర్మఘంట,జనవరి 7 హుజూర్ నగర్:**

హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద చేపట్టిన మోడల్ ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ నిర్మాణాలను ఈ మార్చి 31 లోగా పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రం సమీపంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2160 ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో గృహనిర్మాణాలను రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం కాలేశ్వరం పేరుతో లక్ష కోట్లు కొల్లగొడితే,ఆ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి విడతన 22500 కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున 4 లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు.రానున్న రెండు సంవత్సరాలలో మరో రెండు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. పేదవాడికి పూర్తి భద్రత,భరోసా, ధైర్యాన్ని ఇచ్చే కార్యక్రమమే ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమమని గుర్తు చేశారు.రాజకీయాలకతీతంగా కులం,మతం,వర్గం పేరు అడగకుండా అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలు వెచ్చించి ఇండ్లు కట్టిస్తున్నామని,ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం దశలవారీగా బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామన్నారు.ఇటీవల అసెంబ్లీలో తమ ఎమ్మెల్యేలతో పాటు,ఇతర పార్టీ ఎమ్మెల్యేలు కూడా మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతున్నారని,అలాగే గతంలో గృహజ్యోతి కింద మంజూరు చేసిన ఇండ్లను పూర్తి చేయాలని ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కోరారని,వాటిని కూడా మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు చెప్పారు.గత ప్రభుత్వం కాళేశ్వరం కడితే కమిషన్ వస్తుందని ఆలోచించింది తప్ప పేదవాడికి ఇండ్లు కట్టించలేదన్నారు. అంతేకాక గృహ నిర్మాణ శాఖను అస్తవ్యస్తం చేసిందన్నారు.హుజూర్ నగర్ లో చేపట్టిన 2160 ఇందిరమ్మ హౌసింగ్ కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు.హుజూర్ నగర్ రామస్వామి గుట్టలో చేపట్టిన ఇళ్లను ఈ మార్చి 31 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశం ఇచ్చామని,గృహ నిర్మాణ పాలసీ ప్రకారం బహుపేదల నుండి ఇండ్లకు దరఖాస్తులను తీసుకొని మార్చి 31 లోపు వారికి ఇల్లు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.సంక్రాంతి లోపు లేదా ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులను గుర్తించి తుది జాబితా రూపొందించాలని చెప్పారు.హుజూర్ నగర్ లోని బడుగు,బలహీన వర్గాల పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు మంత్రి హుజూర్ నగర్ ఇందిరమ్మ ఇండ్ల కాలనీలో ఇండ్ల నిర్మాణాలపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి గౌతమ్,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, గృహనిర్మాణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ తో సమీక్షించారు. ముందుగా మంత్రి ఇళ్ల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ మార్చి 31 నాటికి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని చెప్పారు.ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి మిగిలిపోయిన పనులన్నింటిని గుర్తించి పనుల పూర్తికి ప్రతిపాదనలు పంపించాలని, గృహ నిర్మాణాలతో పాటు,రోడ్లు, విద్యుత్,తాగునీరు వంటి మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. హుజూర్ నగర్ కాలనీ పూర్తికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు పురోగతిని పరిశీలించి,నిర్దేశించిన సమయంలోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మిగిలిపోయిన పనుల పూర్తికి అవసరమైన అంచనాలను రూపొందించి పంపిస్తే ఈ నెల 15 లోగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అవసరమైతే పనులను విభజించి పూర్తి చేయాలన్నారు.అనంతరం రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2012లో తాను గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్ నగర్ హౌసింగ్ కాలనీని మంజూరు చేయించడం జరిగిందని,ప్రభుత్వ భూమి లేకపోయినప్పటికీ,దేవాదాయ శాఖ భూమి సుమారు 115 ఎకరాలను సేకరించి ప్రభుత్వానికి నిధులు చెల్లించి పనులు ప్రారంభించామని,గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10 సంవత్సరాలలో పూర్తిగా పనులు నిలిపివేసిందని,తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన, ప్రాధాన్య పథకాల కింద గృహ నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు.హుజూర్ నగర్ ఇందిరమ్మ ఇండ్ల కాలనీ తెలంగాణలోనే కాకుండా దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా నిరుపేదలకు మోడల్ హౌసింగ్ కాలనీగా నిలుస్తుందని తెలిపారు.హుజూర్ నగర్ ఇందిరమ్మ కాలనీలో ఇళ్లకు మెరిట్ ఆధారంగా వెంటనే దరఖాస్తులను తీసుకోవాలని, నిరుపేదలు,ఇండ్లు లేనివారు, నూటికి నూరు శాతం అర్హత ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చేలా ఇందిరమ్మ ఇండ్ల నియమ,నిబంధనల ప్రకారం దరఖాస్తులు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. హుజూర్ నగర్ ఇందిరమ్మ కాలనీలో ఇండ్ల నిర్మాణంతో పాటు,పాఠశాల,అంగన్వాడి,హెల్త్ సెంటర్,కమ్యూనిటీ హాల్, ప్లే గ్రౌండ్ వంటి మౌలిక సదుపాయాలన్ని కల్పిస్తామని తెలిపారు.హుజూర్ నగర్ హౌసింగ్ కాలనీ పూర్తికి ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్ కు పూర్తి సహకారం అందిస్తామని,నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో సన్న బియ్యంతో పాటు,ఇందిరమ్మండ్లకు మంచి పేరు ఉందని చెప్పారు.రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ త్వరలోనే సూర్యాపేట జిల్లా మఠంపల్లికి రానున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు మంత్రులు రామస్వామి గుట్ట ఇందిరమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను,సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సెక్రెటరీ గౌతం,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,జిల్లా ఎస్పీ నరసింహ,జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి సిద్దార్థ్,ఆర్డీవో శ్రీనివాసులు,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం

### రోడ్డు భద్రతలపై సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం సూచనలు

**ధర్మఘంట,జనవరి 7 సూర్యాపేట:**

క్యాబ్ డ్రైవర్లు రోజూ అనేకమంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారని, అందుకే వారు ట్రాఫిక్ నిబంధనలను మరింత కట్టుదిట్టంగా పాటించాల్సిన అవసరం ఉందని,ముఖ్యంగా హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం,వేగ నియంత్రణ,మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వాహనాల ఫిట్‌నెస్‌పై శ్రద్ధ వహించాలని సూర్యాపేట టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం సూచించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ సమీపంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సూర్యాపేట క్యాబ్ డ్రైవర్లను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మరియు పోలీసులు



మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో క్యాబ్ డ్రైవర్ల పాత్ర కీలకమని,ఈ అవగాహన కార్యక్రమం ద్వారా క్యాబ్ డ్రైవర్లలో బాధ్యతాయుత డ్రైవింగ్ పై చైతన్యం కలిగించడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది,క్యాబ్ డ్రైవర్లు మరియు విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆరాధ్య, ఆదర్శ్‌లకు బాపు చిత్ర కళా పురస్కారం



**హైదరాబాద్: జనవరి 8 (ధర్మఘంట)**

తెలంగాణ రాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక రంగానికి చిరస్మరణీయుడు ప్రముఖ రచయిత, కథానాయకుడు, చిత్రబ్రహ్మ బాపు 92వ జయంతి వేడుకలు బొగ్గులకుంట సారస్వత పరిషత్తు ఆడిటోరియం లో ఘనంగా జరిగాయి.బాపు జయంతి సందర్భంగా కళానిలయం సాంస్కృ తిక సంఘ సేవా సొసైటీ వారు నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన దీకొండ ఆరాధ్య & దీకొండ ఆదర్శ్ లకు ఫిల్మ్ డైరెక్టర్ వంశీ, నటుడు శివాజీ రాజా చేతుల మీదుగా " బాపు చిత్రకళా పురస్కారం అందజేశారు. ప్రస్తుతం వీరు నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్ లో ఎడవ తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు దీకొండ రమేష్, అన్న పూర్ణ ఆనందం వ్యక్తం చేశారు. సంఘ ఫౌండర్,సెక్రటరీ సురేందర్ అధ్యక్షురాలు పుష్పలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మధుసూదన్, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని బాబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపు తెలుగు సాహిత్య,నాటక , రచనా రంగాల్లో చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటులు దాస్యప్రియ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కర్ల రాజేష్ మృతి పట్ల పోలీసులు చిత్రహింసలకు గురి చేస్తే మరియు డాక్టర్ల నిర్లక్ష్యం వహించారు

### ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**ధర్మఘంట,జనవరి 07 సూర్యాపేట:**

స్థానిక సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జిల్లా ఆరోగ్య కేంద్రం నందు ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రికార్డుల పరిశీలన మరియు హాస్పటల్ సూపరిడెంట్ ని కలిసి హాస్పటల్లో గత నవంబరు 15వ తారీఖున కర్ల రాజేష్ కు జరిగిన వైద్యం ఏ విధంగా జరిగిందని డాక్టర్లతో చర్చించి ఎవరి వల్ల నిర్లక్ష్యం జరిగిందో పూర్తి దర్యాప్తు చేయాలని నిర్లక్ష్యం వహించిన వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, పేద వర్గాలకు వైద్యం కానీ చట్టం కానీ సమానంగా ఉండే పరిస్థితి లేదని దళిత మాదిగ యువకుడు కర్ల రాజేష్ మృతి ముమ్మాటికి పోలీసుల చిత్రహింసలు డాక్టర్ల నిర్లక్ష్యమేనని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటివరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎలాంటి స్పందనలేదని వారు బాధ్యత వహించి కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఆ నియోజకవర్గంలో మాదిగల సత్తా ఏంటో చూడబోతారని మొదటి ముద్దాయిన చిలుకూరి ఎస్ఐ సురేష్ రెడ్డి ని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సీనియర్ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ, ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు చింత వినయ్ మాదిగ. మాదిగ లాయర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దప్పుకు మల్లయ్య మాదిగ, మందుల శ్రీనివాస్ మాదిగ, నాయకులు బోడ సునీల్ మాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ, బొజ్జ సైదులు మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, మేడి కృష్ణ మాదిగ, ములకలపల్లి మల్లేష్ మాదిగ, కనకయ్య, దాసరి వెంకన్న, కొండేటి గోపి ,దైద శ్రీనివాసు మాదిగ చెరుకుపల్లి కిరణ్ కుమార్ మాదిగ పరిదల సోమయ్య మొండికత్తి గోపిచంద్ మనోజ్ కుమార్ మాదిగ, ములుగురి రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి సన్మానం








**ధర్మఘంట, జనవరి 07, హైదరాబాద్**

విదేశీ ప్రయాణం ముగించుకుని ఇండియాకు తిరిగివచ్చిన బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామిని ఈ రోజు హైదరాబాదులోని అంబేద్కర్ లా కాలేజీలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిప్ప మనోహర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బిజీ శంకర్ సింగ్, తాజా మాజీ కౌన్సిలర్లు గుజ్జ రవి, నీలి కృష్ణ, గోసిక రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి శ్రీనివాస్, తోట మధు, కుంభాల రాజేష్, పినిరెడ్డి లక్ష్మణ్ రావు, సిరికొండ సుస్మిత్, సబ్బాని సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# ఓట్లు,సీట్ల కోసమే రాజకీయమా ప్రజా సమస్యలు పట్టవా!

భారతీయ రాజకీయాల్లో ఒక సాధారణ ఆరోపణ ఏమిటంటే, నాయకులు ఓట్లు మరియు సీట్లు సాధించడంపైనే దృష్టి పెట్టి,ప్రజల సమస్యలను పట్టించుకోరు.ఈ ఆరోపణలో ఎంత నిజం ఉంది? ఎన్నికల వ్యవస్థ,పార్టీల లక్ష్యాలు, వ్యక్తిగత లాభాలు వంటి అంశాలను విశ్లేషిస్తే,ఈ సమస్య భారత లోక్‌సభ మరియు రాష్ట్ర అసెంబ్లీల్లో ఎలా ప్రతిఫలిస్తుందో తెలుస్తుంది. ఎన్నికల వ్యవస్థలోని లోపాలు భారతదేశంలో ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్దవి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 96 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారు. అయితే,ఓటర్లు ఎలా నిర్ణయాలు తీసుకుంటారు అనేది కీలకంగా ఉంటుందని చెప్పాలి. కార్నెగీ ఎండోవ్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ ప్రకారం.. భారత ఓటర్లు తరచుగా కులం,మతం, ప్రాంతీయ గుర్తింపుల ఆధారంగా ఓటు వేస్తారు. కానీ, అభివృద్ధి సమస్యలు కూడా కొంత ప్రభావం చూపుతాయి. అయినప్పటికీ,నాయకులు ఈ గుర్తింపులను ఉపయోగించి ఓట్లు సాధించడంపై దృష్టి పెడతారు, ప్రజా సమస్యలు తరువాతి ప్రాధాన్యతగా మారతాయి. ఎన్నికల్లో మెజార్టీతో గెలవడంఒక సాధారణ ధోరణిగా మారింది. ఇది నాయకులకు పార్టీలో బలాన్ని,భవిష్యత్ అవకాశాలను పెంచుతుంది,కానీ,ప్రజా సేవకు సంబంధం లేదు.కొన్ని రాజకీయ పార్టీల నేతలు పెద్ద మెజారిటీతో గెలవడం వల్ల పార్టీలో వారి స్థానం బలపడుతుంది. అయితే, ఇది ప్రజా సమస్యలపై దృష్టిని తగ్గిస్తుంది.ఫలితంగా ఎన్నికల తర్వాత సమస్యలను మరచిపోతారు.భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ సీట్లు జనాభా ఆధారంగా కేటాయించబడతాయి.అయితే, ఇటీవలి ట్రెండ్‌లు ప్రాతినిధ్యంలో సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. రాష్ట్రాల మధ్య సీట్ల కేటాయింపు అసమానతలు పెరుగుతున్నాయి.ఇది రాజకీయ నాయకులు తమ సీట్లు రక్షించుకోవడంపై దృష్టి పెట్టేలా చేస్తుంది.దీని వల్ల జాతీయ సమస్యల (వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం,పేదరికం)కంటే స్థానిక ఓటు బ్యాంకు రాజకీయాలు ముఖ్యమవుతాయి.మరోవైపు ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు ప్రాతినిధ్యాన్ని మెరుగుపరచాలని ఉద్దేశ్యం,కానీ,అవి కూడా ఓటు రాజకీయాలకు ఉపయోగపడుతున్నాయి.ఒక అధ్యయనం ప్రకారం ఈ కోటాలు అభివృద్ధి ఫలితాలను మెరుగుపరుస్తాయి.కానీ, నాయకులు వాటిని వ్యక్తిగత లాభాలకు ఉపయోగిస్తారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం మతపరమైన ధ్రువీకరణను ఉపయోగించి మూడోసారి అధికారంలోకి వచ్చింది.కానీ,ఇది లౌకికతను బలహీనపరిచిందని విమర్శలు వచ్చాయి. ఎన్నికల పోటీ మరియు నాయకుల ప్రవర్తన ఎన్నికల్లో తీవ్ర పోటీ ఉన్న చోట్ల నాయకులు మరింత బాధ్యతావంతంగా పనిచేస్తారా? అంటే ఒక అధ్యయనం ప్రకారం, పోటీ ఎన్నికల్లో గెలిచిన నాయకులు ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరచడంలో ప్రభావం చూపలేదు.ఇది సూచిస్తుం ది ఏమిటంటే,ఏ రాజకీయ పార్టీ అయినా గెలుపు తర్వాత ప్రజా సమస్యలు మరచిపోతారని,నేడు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం హిందూ జాతీయవాదాన్ని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోందని ఆరోపణలు ఉన్నాయి.అలాగే వివిధ రాష్ట్రాలలో అధికారంలో పార్టీలు కూడా ఊదరగొట్టే ఉచిత హామీలు ఇచ్చి,అధికారం చేపట్టాక ఆ హామీలు నెరవేర్చకుండా విస్మరిస్తున్నాయి. పాలకులపై వస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా కాకుండా ప్రజా సమ స్యల పరిష్కారం దిశగా కేంద్రంలో పాలన కొనసాగాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరఢవిల్లుతుంది. అయితే, ఎన్నికల సమయంలో ఉండే వాతావరణం ప్రజా సమస్యలపై ప్రజల దృష్టిని తప్పిస్తుంది.కానీ, కొందరు ప్రజలకు సమానత్వాన్ని తెస్తాయని వాదిస్తారు.ఎందుకంటే ఎన్నికల రోజులు ప్రజలు తమ గొంతును వినిపించే అవకాశం ఉంటుందని, కానీ,ఇది తాత్కాలికమేనని తెలుసుకోవాలి. మార్పు అవసరం రాజకీయ నాయకులు ఓట్లు, సీట్లు మాత్రమే చూసుకుంటున్నారనే ఆరోపణలో నిజం ఉంది,కానీ,ఇది వ్యవస్థాగత సమస్యగా మారింది. ఎన్నికల సంస్కరణలు, పారదర్శకత,ప్రజా జవాబుదారీ తనం పెంచడం ద్వారా మార్పు సాధ్యమవుతుంది.2024 ఎన్నికలు కొత్త రాజకీయ దృశ్యాన్ని సృష్టించాయి.ఇక్కడ పాలక పక్షం,ప్రతిపక్షాలు బలపడ్డాయి.కానీ,ప్రజా సమస్యలు బలహీనపడ్డాయి. అందుకే దేశంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే రాజకీయాలు ప్రజల కోసమే ఉండాలి,వారి ఓట్ల కోసం కాదు.

# హుజూర్ నగర్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు:మంత్రి ఉత్తమ్

**ఏటిసి విద్యార్థులతో మంత్రి ముఖాముఖి**

**రూ.40 కోట్లతో ఏటిసి,ఆరు కోట్లతో ఐటిఐ కళాశాల నిర్మాణం**

**స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ,ఉపాధి కల్పన**

**ఏటిసికి త్రాగునీటి సరఫరా, టాయిలెట్స్,రవాణాసదుపాయం కల్పనకు నిధులు మంజూరు**

ధర్మఘంట,జనవరి 7 హుజూర్ నగర్:



యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసిందని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్,ఐటిఐ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటీసీ ద్వారా అందించే శిక్షణలో ఆటోమేషన్,రొబోటిక్స్,ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్,3డి లెజర్ ప్రింటింగ్,మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్,సిఎన్ సి మిషన్ టెక్నీషియన్ లాంటి ఆధునిక కోర్సులు ఉన్నాయని,2025-26 సంవత్సరంలో 172 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారని,వారందరికీ నైపుణ్యాలు నేర్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో రోబోటిక్స్ లో శిక్షణ తీసుకుంటున్న లింగగిరి గ్రామానికి చెందిన శ్రీలత, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ లో శిక్షణ తీసుకుంటున్న రాయనిగూడెం గ్రామానికి చెందిన ఉషారాణి,శ్రావణిలతో మాట్లాడారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో శిక్షణ తీసుకుంటున్న ప్రతి ఒక్కరికి శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగం కల్పించేందుకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో త్రాగునీటి వసతి,టాయిలెట్స్ ఏర్పాటు,రవాణా సదుపాయం కల్పించేందుకు వెంటనే నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు.అనంతరం 6 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఐటిఐ కళాశాల భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి నాణ్యత పాటిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేసి,జూన్ నాటికి తరగతి గదులు నిర్వహించేలా అందుబాటులోకి తీసుకొని రావాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,ఎస్పీ కె.నరసింహ,ఏటీసీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ రెడ్డి, అధ్యాపకులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా తప్పక పాటించాలి





**సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత**

**మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు**

**హాజరైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సత్తయ్య**

**ధర్మఘంట, జనవరి 07, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** రోడ్డు భద్రతా నియమాలు తపక పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి.సబిత అన్నారు. రోడ్డు రవాణా భద్రత మాసోత్సవ సందర్భంగా బుధవారం నాడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా అదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల రామన్నపేట నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సత్తయ్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ డ్రైవింగ్ లేదా కాలినడకన వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్టు, హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధన ఉల్లంఘించిన యడల మోటార్ వాహన చట్టం ప్రకారం శిక్షకు అర్హులవుతారని, వాటిపట్ల అందరూ అవగాహనతో ఉండాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు లైసెన్సులు పొందాలని డ్రైవింగ్ లైసెన్స్ లేనియెడల దొరికితే వారి తల్లిదండ్రులు శిక్షకు అర్హులు అవుతారని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ అనుగుణంగా రోడ్డు క్రాస్ చేసి వెళ్లాలని, సిగ్నల్స్ చూసుకుంటూ బండి డ్రైవింగ్ చేస్తూ వెళ్లాలని తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వారందరూ చేత ఈ మాతోత్సవాల సంబంధించిన ప్లేడ్జు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖ నుండి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, రామన్నపేట తహాశీల్దార్ లాల్ బహుదూర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎ. మసీద్, కమిటీ సభ్యులు, ఏజీపి సుక్క శ్రావణ్ కుమార్, సీనియర్ అడ్వకేట్ జినుకల ప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్ లు బి.డేవిడ్, మామిడి వెంకట్ రెడ్డి, అడ్వకేట్ లు



ఎన్.మోగిలయ్య, దినేష్, యాదాసు యాదయ్య, కునూరు శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.జగదీష్, మండల విద్యాధికారి గవ్వ జ్యోతి, సబ్ ఇన్స్పెక్టర్ డి.నాగరాజు, ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు, స్కూల్ కరస్పాండెంట్ చిట్టిబాబు, మల్లిఖార్జున్, నరేందర్ రెడ్డి, మాటిన్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కోక సబిత, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, జూనియర్ కళాశాల విద్యార్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు సమస్యలపై అసెంబ్లీలో అయిలన్న




ధర్మఘంట, జనవరి 07, ఆలేరు:

ఆలేరు నియోజకవర్గానికి మొదటిదశలో కేటాయించిన 3,700 ఇండ్లకు అదనంగా 2,000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, యాదగిరిగుట్టలో మహిళ శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేయాలని, యాదగిరిగుట్ట డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని, ఇందిరమ్మ చీరలను ప్రతి మహిళకు అందించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు.

## ఎమ్మెల్యే మందుల సామేలుకు సన్మానం





ధర్మఘంట, జనవరి 07, తుంగతుర్తి:

ఈరోజు నల్లగొండ జిల్లా డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలును ఎస్సీ డిపార్ట్మెంట్ డిస్టిక్ చైర్మన్ బోడ స్వామి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పెద్ద పీట

**కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్**







ధర్మఘంట జనవరి 07, హైదరాబాద్:

జాతీయ 26 వ ఎస్క్యూఏవై ఛాంపియన్స్ గచ్చిబౌలి లోని బాలయోగి క్రీడా స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభం అయిన సందర్భంగా తెలంగాణ ఎస్క్యూఏవై అసోసియేషన్ వారు ఏజీఎస్ ఆఫ్ (ఎస్క్యూఏవై) ఫెడరేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో బాల బాలికలు వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసి అవసరమైన ప్రతి అంశంలో కూడా అండగా ఉంటూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమలో టీపీసీసీ కార్యదర్శి సామ్యూల్ కార్తిక్, యువజన నాయకులు మహేందర్, మహేష్, వినోద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలేదని హైకోర్టు మెట్లెక్కిన అన్నదాత

**పిటిషనర్ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి**

**కాంగ్రెస్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు ధర్మాసనం**

**కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కోరిన ప్రభుత్వ న్యాయవాది**

**విచారణను వాయిదా వేసిన న్యాయస్థానం**

**ధర్మఘంట,జనవరి 7 వలిగొండ:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రూ.2 లక్షల రైతు రుణమాఫీ పథకం అమలుకు అర్హత ఉన్నప్పటికీ తనకు రుణమాఫీ వర్తించలేదంటూ ఓ రైతున్న న్యాయపోరాటానికి దిగాడు. వివరాల్లోకి వెళితే...యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి వ్యవసాయం కోసం అరూర్ గ్రామంలోని కెనరా బ్యాంకు శాఖలో రూ.1.50 లక్షల పంట రుణం తీసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓనంబర్ 567 ప్రకారం,రూ.2 లక్షల లోపు ఉన్న రుణాలన్నీ మాఫీ చేయాల్సి ఉంది.అయితే గడువు ముగిసినా తన రుణం మాఫీ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాను అన్ని విధాలా అర్హుడినని, అయినప్పటికీ తనను రుణమాఫీ పథకం నుంచి తప్పించడాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ నరసింహారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.బ్యాంకు రికార్డుల్లో కూడా తన రుణానికి సంబంధించి ఎలాంటి లోపాలు లేవని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు,పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.అయితే ఈ అంశంపై సమగ్ర సమాచారం సమర్పించేందుకు కొంత సమయం కావాలని ప్రభుత్వ తరపు న్యాయవాది కోరడంతో, ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ కేసు కీలకంగా మారి ప్రాధాన్యతను సంతరించుకుంది. సాంకేతిక కారణాలతో అనేకమందికి రుణమాఫీ అందలేదన్న ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో,ఈ కేసులో హైకోర్టు ఇచ్చే తీర్పు భవిష్యత్‌లో ఇతర రైతులకు కూడా మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉందని రాష్ట్రంలో అన్నదాతలు భావిస్తున్నారు.

# జిల్లాలో దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

**తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న అలవాటైన నేరస్తులకు కఠిన హెచ్చరిక**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**ధర్మఘంట,జనవరి 7 నల్లగొండ**

జిల్లా పరిధిలో ఇటీవల కాలంలో తరచూ దొంగతనాలు,చోరీలు,చైన్ స్నాచింగ్,ద్విచక్ర వాహనాల చోరీలు,ఇళ్లలో చోరీలు వంటి నేరాలకు పాల్పడుతున్న అలవాటైన నేరస్తులపై జిల్లా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు.బుధవారం జిల్లాలో గతంలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులందరినీ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి హాజరు పరచి కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించి,నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో నేరాలను మానుకొని,సమాజంలో గౌరవప్రదమైన, చట్టబద్ధమైన జీవితం గడపాలని వారికి సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాలకు అలవాటుపడిన వ్యక్తుల కదలికలపై పోలీస్ శాఖ ఇప్పటికే ప్రత్యేక నిఘా బృందాలు,నైట్ పెట్రోలింగ్ టీములు,సీసీటీవీ నిఘా వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యంగా తరచూ నేరాలకు పాల్పడుతున్న నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.తరచూ నేరాలకు పాల్పడుతున్న నిందితులు తమ ప్రవర్తనను వెంటనే మార్చుకోకపోతే, ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ (పీడీ యాక్ట్),రౌడీషీట్‌లు, బైండోవర్ కేసులు,కఠిన చట్టాల కింద అరెస్టులు మరియు రిమాండ్ వంటి చర్యలు తప్పవని కఠినంగా హెచ్చరించారు.ప్రజల ఆస్తి, ప్రాణ భద్రతలకు ముప్పుగా మారే నేరస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.అలాగే,దొంగతనాలకు పాల్పడే ముఠాలు, తిరుగుబాటు నేరస్తులు, అంతర్రాష్ట్ర నేరస్తులపై ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి వారి నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజలు కూడా తమ ఇళ్ల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని,సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,పొరుగువారితో సమన్వయం ఉంచాలని సూచించారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఏదైనా ఘటనలు కనిపిస్తే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని,నేరాలపై జీరో టాలరెన్స్ విధానంతో పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారు సత్ప్రవర్తనతో నేరాలను మానుకొని ఉపాధి మార్గాల వైపు అడుగులు వేయాలని, అలాంటి వారికి పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహాయ,సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజ్ తో అవస్థలు

**వృధాగా రోడ్డుపై పారుతున్న నీరు**

**పట్టించుకోని అధికారులు పరేషాన్ లో ప్రజలు**




**ధర్మఘంట,జనవరి 7 ఆలేరు:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని రైల్వే గేటు దగ్గర మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపైన నీళ్లు వృధాగా పోతున్నాయి.దీనితో రోడ్డంతా బురదగా మారి స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారిందని, ఈ రోడ్డుపై నడిచే పాదాచారులు, విద్యార్థులు,రోజువారీ పనులకు వెళ్లే కార్మికులు చాలా అవస్థలు పడుతున్నారని స్థానికులు, షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని,అలాగే అండర్ పాస్ రోడ్డు మరమ్మతు పనులను సత్వరమే పూర్తిచేయాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో కొత్త వెంకటేశ్వర్లు,బందెల సుభాష్,ఎండి అంకుసు,బాల్ రెడ్డి,పాసికంటి జీవన్,గుత్తి కృష్ణ, ఎగిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి రద్దీ నేపథ్యంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

**కట్టకొమ్ముగూడెం చౌరస్తా తాత్కాలిక మూసివేత**

**కోదాడ పట్టణ సీఐ శివశంకర్**



**ధర్మఘంట,జనవరి 7 కోదాడ:**

సంక్రాంతి పండుగ సందర్భంగా వాహనాల రద్దీ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు కోదాడ పట్టణ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తెలిపారు. కోదాడ పట్టణం గుండా వెళ్లే జాతీయ రహదారి కోదాడ బైపాస్‌లో ఉన్న కట్టకొమ్ముగూడెం చౌరస్తాను తాత్కాలికంగా మూసివేయనున్నట్లు వెల్లడించారు.ఈ నిర్ణయం మేరకు జనవరి 8వ,తేదీ (గురువారం) నుండి కట్టకొమ్ముగూడెం చౌరస్తాను రెండు వైపులా పూర్తిగా మూసివేయడం జరుగుతుందని తెలిపారు.సంక్రాంతి పండుగ అనంతరం పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన తర్వాత మళ్లీ రహదారిని తెరుస్తామని స్పష్టం చేశారు.కట్టకొమ్ముగూడెం,ఉత్తమ్ పద్మావతి నగర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.ప్రత్యేకంగా పండుగ రోజుల్లో భారీ వాహనాలు,ప్రయాణికుల రద్దీ పెరగడం వల్ల రహదారి ప్రమాదాల ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వివరించారు.ఈ నేపథ్యంలో వాహనదారులు హుజూర్‌నగర్ వంతెన క్రింద ఉన్న సేవా మార్గాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. రహదారి నిబంధనలను పాటిస్తూ ప్రజలు,వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఏఐఎన్ పిఎస్ ఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాచన రఘునందన్



**ధర్మఘంట,జనవరి 07 నల్లగొండ:** పాత పింఛను పథకం పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని,పాలకులు ఎవరైనా భాగస్వామ్య పింఛను పథకం రద్దు చేసి తీరాల్సిందేనని ఆలిండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్( ఏఐఎన్ పిఎస్ ఈఎఫ్)జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ స్పష్టం చేశారు.బుధవారం ఆయన నల్గొండలో ధర్మఘంట ప్రతినిధితో మాట్లాడుతూ పాత పింఛను పథకం పునరుద్ధరణ, న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు విషయంలో అటు కేంద్రం,ఇటు రాష్ట్రాలు అనుసరిస్తున్న ధోరణిపై చర్చించేందుకు గాను వివిధ రాష్ట్రాల అధ్యక్షులతో బుధవారం ఉదయం జూమ్ సమావేశం జరిగిందని,ఈ సందర్భంగా దక్షిణ భారతదేశం ప్రతినిధిగా తెలంగాణ నుంచి హాజరైన తనను ఏఐఎన్ పిఎస్ఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు సంఘం జాతీయ అధ్యక్షుడు మంజీత్ సింగ్ స్పష్టం చేసినట్టు రఘునందన్ వివరించారు.దేశ వ్యాప్తంగా కోటి మందికి పైగా ఉద్యోగులు కొత్త పెన్షన్ పథకంలో ఉన్నారని,2004 సెప్టెంబర్ 1 నుంచి ఉమ్మడి అంధ్ర ప్రదేశ్ లో భాగస్వామ్య పింఛను పథకం అమలు ప్రారంభం అయ్యిందని, ఉద్యోగం అంటేనే ఒక సామాజిక భద్రత కాగా,సిపిఎస్ లో ఉన్న ఉద్యోగికి అర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు ఎవరైనా సిపిఎస్ ఉద్యోగికి అవాంఛనీయ సంఘటనకు గురైతే కనీసం లక్ష రూపాయలు కూడా వారి ఖాతాలో ఉండవని, అటువంటప్పుడు పెన్షన్ రాని ప్రభుత్వ ఉద్యోగం కన్నా ప్రైవేటు ఉద్యోగమే మిన్న అన్న భావనను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులు,ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.ఈ నెల 11 న కొత్త ఢిల్లీలో దీనిపై ఒక కార్యక్రమం ఉందని,అందులో అన్ని విషయాలు చర్చించి కార్యాచరణ తీసుకొంటామని తెలిపారు.

## ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ రావుల కృష్ణ

**ధర్మ ఘంట, జనవరి 07,సూర్యాపేట జిల్లా ప్రతినిధి**



హైదరాబాద్ ప్రాంతంలోని శంషాబాద్ లో జనవరి 3, 4,5 తేదీలలో జరిగిన ఎబివిపి 44వ రాష్ట్ర మహాసభల్లో ఎబివిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గా డాక్టర్ రావుల కృష్ణ ఎన్నికయ్యారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం మూసి ఒడ్డు సింగారం గ్రామానికి చెందిన డాక్టర్ రావుల కృష్ణ అతి సామాన్య కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉంటూ దామరచర్లలోని జడ్పీహెచ్ఎస్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ ఆనాటి హాస్టల్స్ స్థితిగతులపై, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. గ్రామంలో నవభారత యూత్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. కె.ఎన్.ఎమ్ డిగ్రీ కళాశాల విద్యార్థి నాయకుడిగా, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడిగా విద్యారంగ సమస్యల పట్ల మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పట్ల అనేక ఉద్యమాలు నిర్వహించడమే కాదు జైలు జీవితం కూడా గడిపారు. అంతేకాక తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అతి సామాన్య కార్యకర్తగా ప్రారంభమైన ఆయన జీవితం నేడు అసమాన్య నాయకునిగా తెలంగాణ ప్రాంత ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల గ్రామంలో పెద్ద ఎత్తున సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా డాక్టర్ రావుల కృష్ణను అభినందిస్తూ గ్రామంలోని పెద్దలు, ప్రజాప్రతినిధులు యువకులు సైతం ఆనంద ఉత్సవాలను జరుపుకున్నారు.

## ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మరో షాక్...!

**రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు**

**ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు**

**మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక**

**పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి**

**ధర్మఘంట,జనవరి 07 ఖమ్మం:**



ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం మరవకముందే బుధవారం మరో ముగ్గురు కార్పొరేటర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి మరోసారి షాకిచ్చారు. కార్పొరేటర్లు ధనియాల రాధ, తోట ఉమారాణి,రుద్రగాని శ్రీదేవిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదివరకే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు సీహెచ్.లక్ష్మీ, జి.చంద్రకళ,డి.సరస్వతి, అమృతమ్మ,ఎం.శ్రావణి కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## తెలంగాణ గిరిజన ఉపసర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బానోతు సురేష్ నాయక్ నియామకం



**ధర్మఘంట, జనవరి 07, సూర్యాపేట:**

సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు ఏ ఎఫ్ ఓ కన్సల్టెన్సీ ఆఫీస్ నందు లంబాడి విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు దారావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన తెలంగాణ గిరిజన ఉపసర్పంచ్ ల సంఘం యూనియన్ కు సభ్యులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి సూర్యాపేట పట్టణానికి వచ్చిన నూతనంగా ఎన్నికైన గిరిజన ఉపసర్పంచులు తెలంగాణ గిరిజన ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని రాష్ట్ర నూతన అధ్యక్షులుగా బానోతు సురేష్ నాయక్ ను ఏన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర నూతన అధ్యక్షులు బానోతు సురేష్ నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన గిరిజన నాయకులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని పూర్తి జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ వివిధ కమిటీలు త్వరలో నిర్వహిస్తామని నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఉపసర్పచ్చులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కమిటీ ద్వారా ఉపసర్పంచులకు సర్పంచుల లాగానే గౌరవ వేతనం ఇవ్వాలని గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించి ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని విధంగా చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం ఉప సర్పంచులు అనిల్ నాయక్, రవితేజ నాయక్, నాగేశ్వరావు నాయక్, విజయ నాయక్, మోహన్ నాయక్, రామ్ సింగ్ నాయక్, ఇస్లావత్ బాలు నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**ధర్మ ఘంట జనవరి 07,సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ సూర్యాపేట జిల్లా కన్వీనర్ భద్ర బోయిన సైదులు తెలిపారు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 10వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన తెలంగాణ ఉద్యమకారుల మహాసభకు బీసీ జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎందరో ఉద్యమకారుల రక్తంతో రాసిన చరిత్ర త్యాగాలతో నిండిన ఉద్యమం ఆత్మ బలిదానాలతో సాధించిన విజయం తెలంగాణ రాష్ట్ర సాధన అన్నారు. తొలి దశ,మలి దశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు సుమారుగా 1500 కుటుంబాలు అమరులయ్యారని గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తమ జీవితాలని పణంగా పెట్టి తెలంగాణ ఉద్యమం కొరకు పోరాడిన ఎందరో ఉద్యమకారులకు ఆర్థిక భద్రత లేక కుటుంబ జీవనాన్ని సాగించుకోలేక ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులను ఆదుకోవాలని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో రానున్న రోజుల్లో టి యు జెఏసితో కలిసి బీసీ జేఏసీ కూడా ప్రతి ఉద్యమంలో ముందుండి పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈనెల 10న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసి జిల్లా నాయకులు నాగరాజు ముత్యం నాగేంద్రబాబు శ్యామ్ యోగి నరేష్ శ్యామ్ కొమ్ము నాగయ్య ఎస్కే సయ్యద్,కట్ట రాజు, మెడబోయిన గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బయ్యన్న వాగు స్టేజ్2 ద్వారా ఎస్సారెస్పీ కాలువకు నీటి విడుదల

**నియోజకవర్గ పంటలకు జీవం పోసినట్లు ఉంది**

**తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు**

**ధర్మఘంట,జనవరి 07**



తుంగతుర్తి:బయ్యన్న వాగు స్టేజ్2 ద్వారా ఎస్సారెస్పీ కాలువ నుంచి పంట పొలాలకు నీటిని విడుదల చేయడం ద్వారా తుంగతుర్తి నియోజకవర్గంలోని పంటలకు జీవం పోసినట్లు ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని పంటలకు బయ్యన్న వాగు స్టేజ్2 ద్వారా ఎస్సారెస్పీ కాలువ నుంచి అధికారికంగా నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని,చివరి ఎకరం వరకు నీరు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలువురు రైతులు మాట్లాడుతూ నీటి విడుదలతో నియోజకవర్గ రైతుల్లో ఆనందం వెల్లివిరిసిందని, సాగునీరు రావడంతో పంటలపై ఆశలు పెరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# గిరిజన గడ్డపై జాతీయ క్రీడా ఘనత!

## మంత్రుల సమక్షంలో, ఎమ్మెల్యే పాయం నేతృత్వంలో 69వ ఎస్జీఎఫ్ అండర్17 జాతీయ కబడ్డీ ఛాంపియన్ షిప్ ఘన నిర్వహణ







**పినపాక**

ఏడూర్ల బయ్యారంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 69వ ఎస్జీఎఫ్ అండర్17 బాలుర జాతీయ కబడ్డీ ఛాంపియన్ షిప్ ఘనంగా నిర్వహించబడింది. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి సీతక్క, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్ తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఘనంగా స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించి, మంత్రివర్యులను, ఎమ్మెల్యేలను ఉత్సాహభరితంగా ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన పినపాక నియోజకవర్గ పరిధిలోని ఏడూర్ల బయ్యారంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం రాష్ట్రానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. "తెలంగాణ గడ్డపై, ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ క్రీడా విధానానికి నిదర్శనం. ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయి. ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, "గిరిజన ప్రాంతాల్లో క్రీడలు అభివృద్ధి చెందితే అక్కడి యువతకు సరైన దిశ లభిస్తుంది. ఏడూర్ల బయ్యారంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరగడం ఇక్కడి విద్యార్థుల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతుంది. క్రీడలు గెలుపు – ఓటమికే పరిమితం కావుడ అవి జీవితానికి అవసరమైన క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నేర్పుతాయి. తెలంగాణ ప్రభుత్వం గిరిజన యువత ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలకు పెద్దపీట వేస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పినపాక శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "గిరిజన ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం మా ప్రాంత ప్రజలకు గర్వకారణం. ఇది కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదుడ గ్రామీణ యువతలో దాగి ఉన్న అపారమైన ప్రతిభకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చే గొప్ప వేదిక. గతంలో ఇలాంటి పెద్ద క్రీడా పోటీలు నగరాలకే పరిమితమయ్యేవి. కానీ నేడు తెలంగాణ ప్రభుత్వం గిరిజన, మారుమూల ప్రాంతాలను కూడా క్రీడా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తోంది. క్రీడల్లో క్రమశిక్షణ, కష్టపాటు, పట్టుదల ఉంటే గ్రామం నుంచే దేశాన్ని శాసించే క్రీడాకారులు తయారవుతారు. పినపాక నియోజకవర్గంలో క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మైదానాలు, ప్రోత్సాహక కార్యక్రమాలు మరింత విస్తరించేందుకు నా వంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇస్తున్నాను. రేపటి రోజుల్లో ఇక్కడి నుంచే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ జెండా ఎగరవేసే క్రీడాకారులు రావాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి ఎస్పీ పీడీ వీరన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్, క్రీడా అధికారులు, టీపీసీసీ మెంబర్ చంద సంతోష్, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పినపాక నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ జాతీయ స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ విజయవంతమైన నిర్వహణకు కంది సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుండి కంది సుబ్బారెడ్డి, వారి తనయుడు విశ్వభారత్ రెడ్డి అవసరమైన సహకారం అందించినందుకు ఈ సందర్భంగా నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్






**కొత్తగూడెం**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడిఓసి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు, వాహనదారులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఉన్న గుంతలను వెంటనే గుర్తించి పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై గుంతలను పూడ్చే బాధ్యత సంబంధిత ప్రతి శాఖకూ ఉందని అన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఇందుకు అనుగుణంగా బ్లాక్ స్పాట్ల మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం పట్టణంలో రైల్వే స్టేషన్ పరిసరాలు లక్ష్మీదేవిపల్లి మోర్ సూపర్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే కొత్తగూడెం పట్టణంలోని ఫుట్‌పాత్‌ల వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారులను అనువైన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తగిన స్థలాన్ని గుర్తించాలని అన్నారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను మరమ్మత్తులు చేసి సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం జైలు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

## ప్రజలకు త్రాగు నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్



**ఏటూరునాగారం**

ప్రజల సమస్యల పట్ల తక్షణమే స్పందిస్తూ, అభివృద్ధిలో ఏటూరునాగారం గ్రామ పంచాయతీని ఆదర్శంగా నిలుపుతున్నారు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు. గ్రామంలో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన వీరు, సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలోని వివిధ వార్డులలో మొరాయించిన పాడైపోయిన హ్యాండ్ పంపులను చేతి పంపులను వెంటనే గుర్తించి, వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ స్వయంగా వార్డుల్లో పర్యటించి ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో తెలుసుకుని సాంకేతిక సిబ్బందితో పంపులను బాగు చేయించారు. నీటి ఎద్దడికి చేతి పంపులు మళ్లీ పనిచేయడంతో ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజల దాహార్తి తీరింది. నాయకత్వ పటిమ ఏ సమస్య వచ్చినా అధికారులు మరియు ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం పాటిస్తూ, పరిష్కారం దిశగా అడుగులు వేయడంలో శ్రీలత–లక్ష్మణ్ బాబు ఎప్పుడూ ముందుంటారు. ప్రజల కష్టాలను తమ కష్టంగా భావించి, నిరంతరం గ్రామాభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఈ జంట నాయకత్వం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సంక్షేమమే మా ధ్యేయం.. ఏటూరునాగారాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా లక్ష్యం అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**పి ఆర్ సి నివేదిక విడుదల చేయాలి**




**మణుగూరు**

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పిఆర్ సి నివేదికలు విడుదల చేయాలని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. బుధవారం మణుగూరులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా క్యాలండర్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులు ఉద్యోగులు, తమ హక్కుల కోసం పోరాట నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు అందరూ సంసిద్ధులుగా ఉండాలని కోరారు. విద్యావంతులు, మేధావులు మౌనంగా ఉండడం వల్ల పేద విద్యార్థులకు, పేదలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. పెన్షనర్స్ బిల్లుల సమస్య పై ప్రభుత్వం వెంటనే స్పందించాలని,అలాగే పి ఆర్ సి, డి ఎ, పెండింగ్ బిల్లులను త్వరతగతిన ప్రభుత్వం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బి మురళీ మోహన్, మ.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్. కృష్ణ జిల్లా కార్యదర్శులు బి రాము,బి రాంబాబు, మణుగూరు మండల అధ్యక్షులు త్రినాథ్ ప్రధాన కార్యదర్శి బి .ఐలయ్య, ఉపాధ్యక్షులు ఎస్ కే. మీరా హుస్సేన్, విజయలక్ష్మి, మరియు మండల నాయకులు, నర్సింగరావు, స్వరూపరాణి , బి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల క్రితం...

## వణికించిన బ్లోఅవుట్

**8 జనవరి 1995..సాయంత్రం 6:50కి ఎగసిపడిన మంటలు**

**కాకినాడ :** కోనసీమ అంటే ప్రకృతి అందాలు..పండుగలు..రకరకాల వంటకాలు మాత్రమే అనుకునే రోజుల్లో జరిగిన అగ్ని ప్రమాదం దేశాన్నే వణికించింది. ాఔఉఅ గ్యాస్ లీక్ వల్ల ఏర్పడిన పాశర్లపూడి బ్లో ఔట్ కోనసీమ పేరును దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేసింది. మరో భోపాల్ దుర్ఘటనలా మారుతుందా అనే విశ్లేషణలు, భయాలు వెలువడేలా చేసిన పాశర్లపూడి బ్లో ఔట్ ఘటన కు 30 ఏళ్ళు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో మలికిపురం మండలంలోని ఇరుసమండ గ్రామం వద్ద జరిగిన ాఔఉఅ గ్యాస్ లీక్ గురించి అందరూ భయపడుతున్నారు. కానీ దీన్ని మించిన అత్యంత ప్రమాదం 30 ఏళ్ల క్రితమే జరిగింది. అమలాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాశర్లపూడి అనే గ్రామంలో ాఔఉఅ గ్యాస్ డ్రిల్లింగ్ పనులు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా లీకేజ్ ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ సంక్రాంతి పండుగకు రెడీ అవుతున్న సమయంలో 8 జనవరి 1995 సాయంత్రం 6:50కి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. 19వ నెంబర్ బావి వద్ద జరిగిన బ్లో ఔట్‌తో మొదలైన అగ్ని జ్వాలలు ఏకంగా 65రోజులపాటు కొనసాగి మార్చి 15 నాటికి అదుపులోకి వచ్చాయి. అన్ని రోజులపాటు అగ్ని జ్వాలలు అలా ఎగసిపడుతుండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా దేశం అంతా భయపడింది. ప్రభుత్వం వెంటనే అలెర్ట్ అయి చుట్టుపక్కల ఉన్న 7 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించింది. ఏదో రెండు మూడు రోజుల్లో మళ్ళీ సొంత ఊరికి వచ్చేస్తామనుకున్న ప్రజలు ఏకంగా రెండు నెలల పాటు తమ ఊళ్లకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు ఆ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు కానీ ప్రమాదం సంభవించిన రిగ్ నెంబర్ 19 మొత్తం నాశనం అయిపోయింది. ఆ రోజుల్లోనే దాని విలువ 9.2 కోట్లు. అది కాకుండా చుట్టుప్రక్కల ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోయింది. వాటి విలువ మరో 7కోట్లు.ఎంత ట్రై చేసినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అమెరికాలోని హుస్టన్‌కు చెందిన నీల్ ఆడమ్స్ ఫైర్ ఫైటర్స్ సంస్థ ఇంజనీర్లను రప్పించారు. కానీ వారు చేసిన మొదటి ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత మంటలను అదుపు చేయడానికి వారు మరో పథకం వేసినా అది మరింత ప్రమాదమంటూ దానికి ాఔఉఅ అనుమతి ఇవ్వలేదు. చివరకు ఇంటర్‌నేషనల్ వెల్ కంట్రోల్ సంస్థ ఇంజనీర్లు రంగంలోకి దిగి 15 మార్చ్ 1995న మంటలను అదుపులోనికి తీసుకుని రాగలిగారు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో ఔట్‌గా చరిత్రకెక్కింది. ఏకంగా 200మీటర్ల ఎత్తుకు మంటలు ఎగసిపడ్డాయి.అప్పట్లో బ్లో ఔట్ కారణంగా ఎగడిపడుతున్న మంటలు చాలా కిలోమీటర్ల దూరానికి కనపడేవి. వాటిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు కోనసీమ వచ్చేవారు. ప్రస్తుతం అంతా ఒకే అన్నట్టు కనపడుతున్నా 30 ఏళ్ల తర్వాత కూడా బ్లో ఔట్ అన్న మాట వినగానే భయంతో ఉలిక్కిపడుతుంటారు పాశర్లపూడి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు. తాజాగా మలికిపురం బ్లో ఔట్ ప్రమాదంతో ఆనాటి భయంకర పరిస్థితుల గురించి మరోసారి గుర్తు చేసుకుంటున్నారు అప్పటి తరం వారు.